
ప్రజాశక్తి

విశాఖ

బుధవారం జనవరి 3, 2018



మంత్రి గంటా శ్రీనివాసరావును నిలదీస్తున్న స్థానిక నాయకుడు, దుంప కనకమ్మ



నేటి నుంచి సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ టోర్నమెంట్

ఐదు రాష్ట్రాల నుంచి 98 జట్లు

వార్త 12లో..



మూగ గిరిజన బాలికపై అత్యాచారం

దువ్వాడ సెజ్‌లో అమానవీయ ఘటన

వార్త మెయిన్ 3లో..

రణ భూమి

- ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల సమస్యలపై నిలదీత
- జన్మభూమి కమిటీల పెత్తనంపై ఆగ్రహం
- బోయలను ఎస్టీల్లో చేర్చడంపైనా...
- మంత్రి గంటా, ఎమ్మెల్యే కిడారిని ప్రశ్నించిన ప్రజలు
- ఎమ్మెల్యే బండారుపై అసహనం
- బెడిసి కొట్టిన ప్రభుత్వ వ్యూహం

ప్రజాశక్తి -విశాఖపట్నం

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు రణ భూమిగా మారాయి. ఎన్‌టిఆర్ ఇళ్లు, పింఛన్లు, తెల్లరేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు తెలుగుదేశం వారికే అందుతున్నాయని, నిజమైన లబ్ధిదారుల దరిదాపులకు చేరడం లేదని బాధితులు గ్రామ సభల్లో నిలదీశారు. జన్మభూమి కమిటీ పెత్తనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమిలి మండలం కాపులుప్పాడలో మంత్రి గంటా శ్రీనివాసరావును, మిగతా 4లో..

రికార్డు స్థాయిలో బెల్లం దిగుమతి

మంగళవారం ఒకరోజే 42 వేలకు పైగా దిమ్మలు రాక - ఈ ఏడాదిలో ఇదే అత్యధికం

రూ.1.50 కోట్లకు పైగా వ్యాపారం

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక బెల్లం మార్కెట్‌కు మంగళవారం రికార్డు స్థాయిలో బెల్లం దిగుమతి అయింది. వివిధ ప్రాంతాల నుండి రైతులు పెద్ద ఎత్తున బెల్లాన్ని మార్కెట్‌కు విక్రయాల కోసం తీసుకొచ్చారు. మంగళవారం ఒక్కరోజే 42,581 బెల్లం దిమ్మలు మార్కెట్‌కు రైతులు తీసుకురావడం విశేషం. డిసెంబర్, 31, ఈ నెల 1 తేదీల్లో మార్కెట్ సెలవు దినాలు కావడంతో రైతులు మార్కెట్‌కు బెల్లాన్ని తరలించారు. అంతేకాకుండా సంక్రాంతి సమీపిస్తుండడంతో డబ్బులు కోసం రైతులు పెద్ద ఎత్తున బెల్లం తయారీలో నిమగ్నమయ్యారు. ఏ రోజు తెచ్చిన సరుకుకు ఆ రోజే చెల్లింపులు జరగడం ఇక్కడ మార్కెట్‌కు ఆనవాయితీ కావడంతో తెచ్చిన బెల్లానికి వచ్చిన రేట్ల ప్రకారం ఎవరి డబ్బు వారు పట్టుకెళ్లడం జరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక రోజుకు అత్యధికంగా 20 వేలు దిమ్మలు దిగుమతి కాగా



మంగళవారం ఒక్కసారిగా 42వేలకు దాటి రావడం అటు కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతుంది. బెల్లం రేట్లు కూడా నిలకడగా ఉన్నాయి. మొదటి రకం 100 కేజీలు రూ.2,980 రూపాయల నుండి రూ.3,560 వరకు ధర పలికింది. రెండో రకం రూ.2,700 నుండి రూ.3,220 వరకూ, మూడో రకం రూ.2,590 నుండి రూ.2,970 వరకూ క్రయవిక్రయాలు జరిగాయి. మంగళవారం ఒక్కరోజే కోటి 50 లక్షల నుండి కోటి 80 లక్షల రూపాయలకు పైగా వ్యాపారం సాగింది. ఇతర రాష్ట్రాల నుండి డిమాండ్ ఉండడంతో ఎగుమతి వ్యాపారులు బెల్లాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. దీంతో మార్కెట్ కళకళాడింది. మహారాష్ట్ర, కర్నాటక, పశ్చిమబెంగాల్, ఒడిశా, జార్ఖండ్ వంటి ప్రాంతాలకు బెల్లం ఎక్కువగా ఎగుమతి జరుగుతుందని వర్తకులకు తెలిపారు. ముందుముందు మార్కెట్‌కు మరింత బెల్లం దిగుమతి పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. ఏది ఏమైనా మంగళవారం మార్కెట్‌కు బెల్లం పెద్ద ఎత్తున తరలిరావడంతో అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతుంది.



బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న రైల్వే డిఆర్‌ఎం ముకుల్‌శరణ్ మాథూర్

దక్షిణ మండల మహిళా టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖపట్నం

దక్షిణాది రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలకు అసోసియేషన్ ఆఫ్ ఇండియాన్ యూనివర్సిటీస్ (ఎఐయు) పర్యవేక్షణలో నిర్వహిస్తున్న దక్షిణ మండల మహిబళా టెన్నిస్ పోటీలు మంగళవారం గీతం విశ్వవిద్యాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమళనాడు, కర్ణాటక, కేరళ, రాష్ట్రాల నుంచి 39 విశ్వవిద్యాలయాల జట్లు ఈ పోటీలకు హాజరయ్యాయి. పోటీల ప్రారంభోత్సవానికి తూర్పు కోస్తా రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ ముకుల్ శరణ్ మాథుర్ ముఖ్యఅతిథిగా హజరై పోటీలను ప్రారంభంచారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రోఫెసర్ ఎమ్ఎస్.ప్రసాదరావు, ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రోఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ఎమ్.పోతరాజు, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. గీతం టెన్నిస్ కోర్టులో జరిగే ఈ పోటీలలో దాదాపు 70 మంది టెన్నిస్ క్రీడాకారిణులు పాల్గొనున్నారు. దక్షిణ మండల మహిళా టెన్నిస్ పోటీల్లో ప్రతిభకనబరిచే క్రీడాకారిణులను ఎంపికచేసి గీతం లోని జనవరి 4వ తేదీ నుంచి జరిగే అఖిలభారత స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు.

తొలిరోజు పోటీల వివరాలు

మొదటి రోజు జరిగిన పోటీలలో మణిపాల్ విశ్వవిద్యాలయంపై ఎమ్‌జి విశ్వవిద్యాలయం 7-4, 7-1 స్కోరుతో విజయం సాధించగా కెఎల్ యు జట్టుపై కాకినాడ జెఎన్‌టియు జట్టు 7-3, 7-2 స్కోరుతో, అన్నామలై యూనివర్సిటీ జట్టుపై రాయలసీమ జట్టు 7-4, 0-7, 7-4 స్కోరుతో, భారతీదాసన్ యూనివర్సిటీ జట్టుపై కాలకట్ యూనివర్సిటీ జట్టు 7-3,7-0 స్కోరుతో విజయం సాధించాయి. మొదటి రోజు 15 జట్టు హాజరు కాకపోవడంతో ప్రత్యర్థి జట్లుకు వాకోవర్ విజేతలుగా ప్రకటించారు.

దక్షిణమండల క్రికెట్ పోటీలకు గీతం జట్టు ఎంపిక

విశాఖపట్నం: దక్షిణాది రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలకు ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దక్షిణ మండల అంతర విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే గీతం జట్టును ఎంపిక చేసినట్లు గీతం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. జట్టు కెప్టెన్‌గా జి.కృష్ణా వ్యవహరిస్తారని. సభ్యులుగా ఎమ్.ఆయూష్, బి.చంద్రశేఖర్, పి.రోహిత్ వికాస్, పి.గణేష్, వి.హిమాంశురావు, డిఎస్ఎన్.కల్యాణ్, ఎమ్ఎన్.నేతాజీరెడ్డి, కె.అభిజీత్, ఎస్‌విఎస్ గంగాధర్, పి.విజయసాగర్, ఆర్.కె.గుణచంద్ర, డి.సోమింద్ రెడ్డి, ఎన్‌డి కుమార్ రెడ్డి, పి.నవీన్‌కుమార్, జిబి.శాయి ప్రసాంత్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.



దక్షిణ మండల క్రికెట్ పోటీలకు ఎంపికైన గీతం జట్టు

ఇథియోపియా వర్సిటీకి గీతం మేధో సహకారం

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఇథియోపియాలోని ప్రభుత్వరంగంలో నూతనంగా ఏర్పాటయిన వకేమో విశ్వవిద్యాలయం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మేధో సహకారాన్ని కోరుతూ మంగళవారం అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసింది. గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు సమక్షంలో వకేమో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు (అకడమిక్ వ్యవహారాలు) డాక్టర్ అడెన్ హైల్ గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోతరాజు అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా గీతం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ, దేశంలో అత్యుత్తమ శ్రేణి విశ్వవిద్యాలయంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గుర్తింపు సాధించిందని ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, సైన్స్, లా కోర్సులతో పాటు అంతర్జాతీయ వాణిజ్యం, మేనేజ్‌మెంట్ అంశాలపై 140కి పైగా కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కలిసి గీతం సంయుక్త ఒప్పందాలను కలిగి ఉందన్నారు. ఇథియోపియా విశ్వవిద్యాలయంతో కలిసి పని చేయడానికి ఆసక్తితో ఉన్నామన్నారు. వకేమో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ అడెన్ హైల్ మాట్లాడుతూ వివిధ దేశాలకు చెందిన 1700 మంది విద్యార్థులు తమ వద్ద వృత్తి విద్యలు అభ్యసిస్తున్నారని, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సుల్లోని ఉన్నత ప్రమాణాలు పరిశీలించి అవగాహనా ఒప్పందానికి ముందుకు వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రొ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, గీతం అంతర్జాతీయ వ్యవహారాల విభాగం డైరెక్టర్ కెపి.కిషన్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న గీతం, ఇథియోపియా ప్రతినిధులు

నేడు ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు పురస్కారాలు

ప్రజాశక్తి-జిల్లాపరిషత్

సావిత్రిబాయి పేలే జయంతిని పురస్కరించుకొని ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి పురస్కారాలను ఈ నెల 3వ తేదీన ప్రదానం చేయనున్నట్లు జిల్లా సర్వశిక్ష అభియాన్ పిఒ టి.శివరామప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ఎ పథకం రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమం బుధవారం ఉదయం 10 ఆంధ్రా యూనివర్సిటీ కాన్వొకేషన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

తడి-పొడి చెత్తను విభజించి అందించాలి

జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

ప్రజాశక్తి-విశాఖపట్నం

ప్రజలు ఇంటి వద్దనే చెత్తను తడి-పొడి చెత్తను విభజించి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. 24, 25 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించి పలు సూచనలు చేశారు. పాత పోస్టాఫీసు, థాంప్సన్ వీధి, సోల్జర్‌పేట చిన్నంవీధులలో పర్యటించారు. ప్రజలు కాలువలలో చెత్తా చెదారాలను వేయరాదని పేర్కొన్నారు. మురుగు నీరు నిల్వ చేరితే ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదమన్నారు. దీనిని గమనంలో ఉంచుకొని ప్రజలు కాలువల్లో చెత్తవేయకుండా ఉండాలని సూచించారు. సిల్ట్ తొలగించకపోవడం వల్ల మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెలువడుతోందని అభిప్రాయపడ్డారు. రహదారులను సక్రమంగా శుభ్రపరచాలని, ఓపెన్ పాయింట్స్ లేకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైనచోట రోడ్లకు మరమ్మత్తులు నిర్వహించాలని పేర్కొన్నారు. వైన్‌షాపు వద్ద అపారిశుధ్యం ఉండడంతో జరిమానా విధించాలని ఆదేశించారు. పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేనందున అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్యంలో మార్పు లేకుంటే కఠినచర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఈ పర్యటనలో మూడవ జోనల్ కమిషనర్ వి.చక్రధరరావు, ఎఎంఒహెచ్ డాక్టర్ సుధాకర్, ఇఇ గణేష్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నవీన్, ఆదిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

ఉదయం 9.30 గంటలకు రఘు ఇంజినీరింగ్ కళాశాలలో సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఉదయం 9.30 గంటలకు సిపిఎం జగదాంబ కార్యాలయంలో పార్టీ జిల్లా మహాసభల సందర్భంగా ప్రెస్‌మీట్

ఉదయం 9.30 గంటలకు డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించనున్న ప్రజా బ్యాలెట్‌పై సిఐటియు ప్రెస్‌మీట్

సాయంత్రం 4 గంటలకు పౌర గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే187వ జయంతి

సాయంత్రం 6 గంటలకు ప్రేమ సమాజంలో సినీ సంగీత విభావరి


చికెన్ ధరలు

బాయిలర్ (బ్యాగ్) లైవ్	రూ. 95.00
విత్ స్కిన్	రూ.160.00
స్కిన్ లెస్	రూ.170.00
కోడిగుడ్లు (100 గుడ్లు)	రూ.366.00

అత్యవసర సమాచారం

కింగ్ జార్జ్ ఆసుపత్రి	- 2564891
విక్టోరియా ఆసుపత్రి	- 2562637
మెంటల్ ఆసుపత్రి	- 2754918
ఎన్ రాజా రక్తనిధి కేంద్రం	- 2543436
పోలీస్ కంట్రోల్ రూమ్	- 100, 2565454
క్రైమ్ స్టాపర్	-1090
ఆర్టీసీ	- 2746400
తాగునీటి ఫిర్యాదులు	- 2517261
ఫైర్	- 101
రైల్వే రిజర్వేషన్ ఎంక్వైరీ	- 135
వంట గ్యాస్	- 2578158
విద్యుత్ సమాచారం	- 2718091
ఇండియన్ ఎయిర్ లైన్స్	- 2746501

సినిమా... సినిమా



టూ కంట్రీస్ : జ్యోతి, వి మ్యాక్స్ 3, శ్రీరామ, శ్రీ నరసింహ (గోపాలపట్నం)

ప్రోజెక్టు : శ్రీ లీలామహల్, పరమేశ్వరి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం)

జుమంజి : శారద, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం)

ఒక్క క్షణం : వి మ్యాక్స్ 1, కిన్నెర, శ్రీ లక్ష్మీ నరసింహ (104 ఏరియా), సత్యం (గోపాలపట్నం)

హలో : మెలోడి, సంగం, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (సుకన్య)

ఎంసిఎ : జగదాంబ, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీ లక్ష్మీ నరసింహ స్క్రీన్ 1 (104 ఏరియా), శంకర (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్‌విసి లిఖిత (శ్రీహరిపురం), కన్య స్క్రీన్ 1 (గాజువాక), ఎస్‌టిబిఎల్ స్క్రీన్ 2 (షీలానగర్)

ఇఊ : వి మ్యాక్స్ 3

ఖాకీ : వెంకటేశ్వర స్క్రీన్ 2

టైగర్ జిందగీ హై : రమాదేవి

రాజా ది గ్రేట్ : శ్రీకాంతి

జవాన్ : వి మ్యాక్స్ 2

పెట్రేగుతున్న రౌడీయిజం



గేదెల రాజు హత్యకేసులో నిందితుడు డిసిపి రవిబాబు (ఫైల్)

నగరంలో కొత్తగా పుట్టుకొస్తున్న గ్యాంగ్‌లు
నిత్యం కత్తులతో రోడ్లపై తిరుగుతున్న వైనం
పెరిగిన పాత కక్షలు, సుపారీ హత్యలు
వరుస హత్యలతో బెంబేలెత్తుతున్న జనం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ప్రశాంత నగరంగా పేరుగాంచిన విశాఖ హత్యలకు కేంద్రంగా మారుతోంది. రౌడీషీటర్లు, ముఠా తగాదాలు, ప్రతీకార హత్యలకు కేరాఫ్ అడ్రస్ అవుతుంది. స్మార్ట్ సిటీగా, రాష్ట్ర ఆర్థిక రాజధానిగా, సిటీ ఆఫ్ డెస్టినీగా, మెట్రో నగరంగా గుర్తింపు పొందడంతో దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు ఇక్కడ శాశ్వతంగా నివాసముండేందుకు ఇష్టపడతారు. దీనికి కారణం నగరంలో ప్రశాంత వాతావరణం. కేవలం పచ్చదనం మాత్రమే కాకుండా నగర ప్రజల మంచితనం, ఇతరులను అక్కున చేర్చుకొనే మనస్తత్వం ఇతరులను కట్టిపడేస్తుంటాయి. ముఖ్యంగా హైదరాబాద్, ముంబయి వంటి నగరాలతో పోల్చితే నేరాల సంఖ్య తక్కువగా ఉండడం కూడా వారు ఇష్టపడటానికి ఒక కారణంగా చెప్పుకోవచ్చు. కానీ ఇటీవల ఈ పరిస్థితి మారుతోంది. నగరంలో ముఠా తగాదాలు ఎక్కువయ్యాయి. ఇవి హత్యలకు దారితీస్తున్నాయి. నడిరోడ్డుపై కత్తులతో పొడిచి చంపడం నగరంలో సర్వసాధారణమైపోయింది. దీంతో విశాఖ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా ఇక్కడ నివాసమంటేనే భయపడుతున్నారు.

నగరంలో వరుస జరుగుతున్న హత్యలను, అసాంఘిక కార్యకలాపాలను, అరాచక శక్తుల ఆగడాలను చూస్తుంటే జిల్లా వాసుల్లో గుబులు రేగుతోంది. రాను రాను నగరం ఏ దిశగా పయనిస్తోందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సిటీలో రకరకాల మాఫియాలు పుట్టుకొస్తున్నాయి. రూ.1500 నుంచి వేలు, లక్షల రూపాయల వరకూ సుపారీలు తీసుకుని హత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల రౌడీషీటర్ గేదెల రాజును హత్య చేసి కాల్చిబూడిద చేశారు. మొన్నటికి మొన్న ఒక వైద్యునిపైన గుర్తు తెలియని వ్యక్తులు యాసిడ్ దాడి చేసి పరారయ్యారు. ఇటువంటి దాడి జరగడం విశాఖలో ఇదే ప్రథమం. ఈ దాడి పోలీసు వర్గాల్లో సైతం కలకలం రేపింది. నగరంలోకి ఎవరు వస్తున్నారు ? ఎక్కడ నివసిస్తున్నారు ? ఏం చేస్తున్నారు ? వంటి అంశాలపై ఇంటెలిజెన్స్ నిఘా పెంచాల్సిన పరిస్థితిని ఈ నేరాలు రూఢీ చేస్తున్నాయి.

వరుస హత్యలు

పోలీసు నిఘా తగ్గడంతో కైలాసపురానికి చెందిన సంతోష్ అనే బాక్సర్‌ను కెఆర్ఎమ్ కాలనీలో కత్తులతో పొడిచి చంపారు. గత వినాయకుని చవితి పండగ రోజు కైలాసపురం వద్ద మహారాణి వీధిలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగి రాజు అనే కారు డ్రైవర్‌ను కత్తులతో పొడిచి చంపేశారు. డిసెంబరు 29 రాత్రి నగరం నడిబొడ్డులోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆటోలో కొంత మంది యువకులు కత్తులతో వచ్చి సురేష్ అనే యువకున్ని పొడిచి హత్య చేశారు. డిసెంబరు 31 అర్థరాత్రి అక్కిరెడ్డిపాలెంలో రౌడీషీటర్ షేక్‌కుమార్‌పై దాడి చేసి చంపేశారు. దీనికి ముందు ఆరిలోవలో నడి రోడ్డుపై ఓ వ్యక్తిని హత్య చేశారు. ఇలా వారంలో రెండు మూడు హత్యలు జరగడం పరిపాటిగా మారింది. 15 సంవత్సరాల వయసు కూడా దాటని యువకులు వ్యసనాలకు బానిసలై డబ్బుల కోసం హత్యలకు పాల్పడుతున్నారు. వీరిని రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లకు కూడా వినియోగిస్తున్నట్టు సమాచారం. దీంతో నగరంలో శాంతి భద్రతలు క్షీణించాయని స్పష్టమవుతోంది. నేరస్తుల కదలికలను ముందస్తుగా గమనించకపోవడం కూడా హత్యలకు ఒక కారణంగా చెప్పుకోవచ్చు. గతంలో వార్డుల వారీగా అలజడులకు పాల్పడే వ్యక్తుల వివరాలను సేకరించి అవసరమైన చర్యలు తీసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చేవారు. ఇప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడానికే పోలీసులు పరిమితమవుతున్నారు. ఫలితంగా శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి పోతున్నాయని నగర వాసులు ఆందోళన చెందుతున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీసులు (ఫైల్‌ఫోటో)

లారీ ఢీకొని యువకుడు మృతి



లారీ కింద పడి మృతి చెందిన నాయుడు

ప్రజాశక్తి- సబ్బవరం

మండల కేంద్రంలోని జోడుగుళ్ల జంక్షన్ వద్ద మంగళవారం లారీ ఢీకొని ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సబ్బవరం పాత పోస్టాఫీస్ వీధికి చెందిన గండి నాయుడు (22) ఉదయాన్నే జోడుగుళ్ల జంక్షన్‌కు టి తాగడానికి వెళ్లి రోడ్డు దాటుతున్న క్రమంలో అనకాపల్లి నుండి పెందుర్తి వెళు‌తున్న లారీ జోడుగుళ్ల జంక్షన్ వద్ద ఢీకొంది. దీంతో నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు సన్నిబాబు, మహాలక్ష్మి కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. స్థానిక ఎస్ఐ ఎన్ ప్రభాకరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారు.

మట్టి కలసాలతో జగన్నాధునికి స్నానం

కూర్మన్నపాలెం : అగనంపూడిలోని జగన్నాధస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున స్వామిని మంగళ వాయిద్యాలతో మేల్కొపి 108 మట్టి కలసాలతో దర్శనస్నానం చేయించారు. ఆలయ ప్రధాన అర్చకులు గురు సంతోష్‌కుమార్ ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం దర్శనాలను కల్పించారు. మొదటి దర్శనాన్ని ఆలయ చైర్మన్ గొల్లవిల్లి వెంకటరావు, ఆలయ ఇఒ రమాభాయికి కల్పించారు. ఈ కార్యక్రమంలో గురు త్రినాధ, బలిరెడ్డి నాగేశ్వరరావు, చిత్తా కనకరాజు, కరణం సత్యారావు, కడవల వెంకటరమణ, కొర్రాయి జగదీష్, మామిడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మహేష్ ప్రతిభ

కశింకోట : ఇటీవల కేరళ రాష్ట్రంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో కశింకోట డిపిఎస్ బాలుర స్కూల్ విద్యార్థి డి.మహేష్ విజయం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని మంగళవారం డిపిఎస్ పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె శ్రీధర్‌రెడ్డి, పిడి టి గోపీనాథ్, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ భవనం ప్రారంభం

నక్కపల్లి : నక్కపల్లి మార్కెట్ సమీపంలో ఐసిడిఎస్ నూతన భవనాన్ని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం ప్రారంభించారు. రూ.53 లక్షలతో సమగ్ర శిశుఅభివృద్ధి సేవా పథకం అధికారి కార్యాలయాన్ని నూతనంగా నిర్మించారు. ఇప్పటి వరకు అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంగలపూడి అనిత సమక్షంలో మంత్రి యనమల భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెసి సృజన, ఆర్‌డిఒ సూర్యారావు, ఐసిడిఎస్ పీడీ చిన్నయిదేవి, పిఒ శారదాదేవి, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ రాణి అమ్మాజీ, ఇఒఆర్‌డి పిఎస్ కుమార్, జిల్లా పరిషత్ కోప్షన్ మెంబర్ కొప్పిశెట్టి కొండబాబు, ఎంపిపి లావణ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా

హుకుంపేట : సిహెచ్‌డబ్ల్యుల వేతనాలు పెంచాలని కోరుతూ ఈ నెలాఖరులో విజయవాడలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సిఐటియు మండల నాయకురాలు ఎస్.హైమావతి తెలిపారు. మంగళవారం సిహెచ్‌డబ్ల్యులు తమ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో హుకుంపేట పిహెచ్‌సి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయకుండా సిహెచ్‌డబ్ల్యులతో వెట్టిచాకిరీ చేయించుకోవడం సరికాదన్నారు.

ఎన్‌జిఎస్ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆనందపురం : నాగావళి గ్రామీణ అభివృద్ధి సేవా సమితి నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండలంలోని ఆనందపురం ఇందిరమ్మ కాలనీలో ఎన్నుకున్నారు. సంఘానికి ఉత్తరాంధ్ర అధ్యక్షుడుగా జివి.భాస్కరరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడుగా కోరాడ అప్పలస్వామినాయుడు, ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఒమ్మి అచ్యుతరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంగటి రాము, ఉత్తరాంధ్ర మహిళా అధ్యక్షురాలుగా జి.కృష్ణవేణి, కార్యదర్శిగా జి.హరిబాబు, జిల్లా కార్యదర్శిగా బోద రాంబాబు, నాగావళి చిల్డ్రన్ హోమ్ ఇన్‌ఛార్జిగా కె.లక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఈ సంఘం వృద్ధులు, అనాథలు, వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

7న విజ్ఞాన విహార 38వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆనందపురం

గుడిలోవలోని విజ్ఞాన విహార ఆశ్రమ పాఠశాల 38వ వార్షికోత్సవాన్ని ఈ నెల 7న నిర్వహించనున్నట్లు మంగళవారం పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. విశిష్ట అతిథిగా కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ హాజరవుతారని పేర్కొంది. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జెసి సృజన, విద్యాభారతి జాతీయ కార్యదర్శి అవనీష్ భట్నాగర్, ఆర్‌విఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఎమ్‌డి ఆర్.వెంకటేశ్వరరావు హాజరుకానున్నట్లు తెలిపింది.

నేల్తేరులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆనందపురం

నాగావళి గ్రామీణ అభివృద్ధి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 7న నేల్తేరు గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షులు జివి.భాస్కరరావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. రక్త పరీక్షలు, సాధారణ, కంటి సంబంధిత వైద్య పరీక్షలు ఉచితంగా జరిపి మందులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

డిసిఐ ప్రయివేటీకరణ దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి - ఆరిలోవ

లాభాల బాటలో నడుస్తున్న డిసిఐని ప్రయివేటీకరించడం దుర్మార్గమైన చర్యగా సిఐటియు నగర అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి కుమార్ అన్నారు. దీనిలో భాగంగా డిసిఐని ప్రయివేటీకరణ వద్దంటూ ఆరోవార్డు పరిధి, విశాలాక్షినగర్‌లో వివిధ ప్రాంతాల్లో మంగళవారం పాద యాత్ర నిర్వహించారు. ప్రధాన రహదారులు, కాలనీల్లో కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రూ.28 కోట్లతో ప్రారంభమైన డిసిఐ నేడు రూ.6వేల కోట్లతో లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థను ప్రయివేటుకు కట్టబెట్టేందుకు బిజెపి కుట్ర చేస్తుందని విమర్శించారు. మేకిన్ ఇండియా అని లక్షల్లో ఉద్యోగాలిస్తామని ఊదరగొడుతున్న ప్రధాని మోడి మరోవైపు ఉన్న ఉద్యోగులను రోడ్డు పాల్జేస్తున్నారన్నారు. డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఎపి పార్లమెంటు సభ్యులు పోరాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.శంకర్, ఐసి నాయుడు, ఐద్వా నగర అధ్యక్షులు బి.సూర్యమణి, పిట్టా నారాయణ పాల్గొన్నారు.



పాదయాత్రలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు శంకర్, సూర్యమణి



హరితకు డాక్టరేట్ అందజేస్తున్న వీసీ నాగేశ్వరరావు

హరితకు డాక్టరేట్

ప్రజాశక్తి- మద్దిలపాలెం

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగంలో గౌంతిన హరిత రసాయన శాస్త్రంలో పరిశోధన నిర్వహించి డాక్టరేట్ పొందారు. నీటి కాలుష్యానికి దోహద పడే అనేక కారణాలలో రసాయన పరిశ్రమల నుంచి వెలువడే రసాయన రంగు వ్యర్థాలు అతి ముఖ్య మైనవి అనే అంశంపై ఆచార్య బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పరిశోధనలు నిర్వహించారు. తన పరిశోధన విషయంగా తీసుకొని ఈ వ్యర్థాలను సమర్ధవంతంగా తగ్గించే కొత్త రకమైన ఉత్ప్రేరకాలను తయారు చేశారు. ఈ విషయాలను తన పరిశోధన గ్రంథంలో విపులీకరించారు. ఈమెకు ఎయు వీసీ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు.

విసి నాగేశ్వరరావుకు శుభాకాంక్షల వెల్లువ

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్శిటీ విసి ఆచార్య జి.నాగేశ్వరరావును నూతన సంవత్సరం సందర్భంగా పలువురు అభినందించారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విసి ఆచార్య వి.కేశవరావు, రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘులు మంగళవారం వర్సిటీ విసి ఆచార్య జి. నాగేశ్వరరావును ఆయన కార్యాలయంలో ప్రత్యేకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. పలువురు వర్సిటీ ఉద్యోగులు, అనుబంధ కళాశాలల ప్రతినిధులు, పరిశోధకులు విసికి శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న విజయకుమారి

విద్యార్థులకు పండ్లు పంపిణీ

మద్దిలపాలెం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భీమిలి మండలం మజ్జివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. పాఠశాల ఆంగ్లభాష ఉపాధ్యాయులు ఆర్.విజయ కుమారి పండ్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆరోగ్యాన్ని అందించే విధంగా పండ్లు పంపిణీ చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు 1వ వార్డులో జన్మభూమి

ఆరిలోవ: ఒకటోవార్డు పరిధి ఆరిలోవ కాలనీ, చివరి బస్టాపు వద్ద గల శ్రీసాయి కల్యాణమండపంలో జన్మభూమి, మాఊరు ఐదో విడత కార్యక్రమం జరుగుతుందని వార్డు జన్మభూమి కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9గంటల నుండి జరగబోవు జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో వార్డుకి సంబంధించిన పేదలకు 227 రేషన్ కార్డులు, 129 సామాజిక పింఛన్లు, 296 జిఒ ప్రకారం 67 పట్టాలు, 200 మందికి ఇంటి పన్ను పాస్ పుస్తకాలు లబ్దిదారులకు మంజూరు చేయనున్నారు. ఈనెల 2 నుండి జరగబోవు జన్మభూమి, మాఊరు కార్యక్రమం అనంతరం సమస్యలపై చర్చ, డ్వాక్రా మహిళలకు సంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్న తెలిపారు.

డాన్స్ ప్లస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మద్దిలపాలెం

స్ట్రేంజ్ వీఆర్ట్స్, వీరుమామ ఆధ్వర్యంలో వైజాగ్ ప్లస్ పేరిట ఆల్ ఇండియా లెవెల్ డాన్స్ కాంటెస్ట్‌కు మంత్రి గంటాద్వారా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగ సుదర్శన్ మాట్లాడుతూ జనవరి 19 న మద్దిలపాలెం కళాభారతిలో గ్రాండ్ ఫినాలే జరుగుతుందని, దీనికి ముంబై నుండి స్వప్నిల్, హైదరాబాద్ నుండి హర్ష మహేశ్వరీ, అనుకూల ఆదిత్య, సూరజ్ లు న్యాయ నిర్ణేతలుగా ఉంటారని అన్నారు. కార్యక్రమానికి విశాఖ కు చెందిన అందరు డాన్సర్స్ పాల్గొంటారని, ఫైనల్ విజేత కు 50000 రూపాయల బహుమతి అందిస్తామని వీరుమామ తెలిపారు. విశాఖ లో ఇలాంటి మంచి కార్యక్రమాలు తరుచు జరగాలని మంత్రి శ్రీ గంట శ్రీనివాస రావు అన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు, సుదర్శన్

1వ వార్డులో మహిళలకు ఆటల పోటీలు



ఆటల పోటీలో మహిళలు

ప్రజాశక్తి-ఆరిలోవ

జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, జైభీమ్‌నగర్‌లోని అంబేద్కర్ సామాజిక భవనంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా డ్వాక్రా మహిళలకు కబాడీ, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. అంతక ముందు మహిళలతో సంక్షేమం- సంతృప్తి అనే అంశంపై చర్చ నిర్వహించారు. టిడిపి వార్డు అధ్యక్ష, కార్యదర్శులు పొత్రకండ ధార్మారావు, యల్లమిల్లి సురేష్, నగర మహిళా ఉపాధ్యక్షులు మజ్జి రమణి తదితరులు దగ్గరుండి పర్యవేక్షించారు.

మొదటి పేజీ తరువాయి

రణ భూమి

శ్రీనివాసరావును, అరకులోయ మండలం చినలబుడు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కిడారి సరేశ్వరరావును సైతం ప్రజలు వదిలిపెట్ట లేదు. బోయలను ఎస్‌టీల్లో చేర్చడంపై టిడిపి ప్రజాప్రతినిధుల వైఖరి చెప్పాలని, జన్మభూమి గ్రామ సభల్లో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని పెద్ద పెట్టున గిరిజనులు డిమాండ్ చేశారు. గ్రామసభల్లో ఎటువంటి ఆందోళనలు, నిలదీతలు లేకుండా చేసుకునేందుకు ప్రభుత్వం సమాజ వికాసం, కుటుంబ వికాసం పేరుతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అయితే అవేవీ ప్రజల దృష్టిని మళ్లించలేకపోయాయి. దీంతో ప్రభుత్వ వ్యూహం బెడిసికొట్టినట్లయింది.

ఏళ్ల తరబడి కాగితాలు పెడుతున్నా పింఛన్లు ఇవ్వడం లేదని, రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదని రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావును ప్రజలు నిలదీశారు. గ్రామస్తురాలు దుంప కనకమ్మ మాట్లాడుతూ, ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా పింఛను రాలేదని, రేషన్‌కార్డు ఇవ్వలేదని, ఎందుకొచ్చిన జన్మభూమి అంటూ మంత్రిని నిలదీశారు. ఊహించని ఈ పరిణామానికి వేదికపై ఉన్న మంత్రి గంటాతోపాటు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు అవాక్కయ్యారు. మంత్రి షాక్ నుంచి తేరుకోకముందే ఎండ్రెడ్డి నర్సింహం రేషన్ కార్డు సమస్యపై నిలదీశారు. 2016లో దరఖాస్తు చేశాను. ఇప్పటి వరకు రేషన్ కార్డు మంజూరు చేయలేదంటూ ప్రశ్నించారు. జనసేన సేవాదళ్ కో ఆర్డినేటర్ ఈశ్వర్ వేముల మాట్లాడుతూ అర్హులైన పేదలను కాదని కొంతమంది పెద్దోళ్లకు ఎన్టీఆర్ ఇళ్లు మంజూరు చేశారని, ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరపాలని మంత్రిని డిమాండ్ చేశారు. మంత్రి వద్దకు వెళ్లబోతుండగా సిఐ ఎస్.బాలసూర్యారావు ఆధ్వర్యాన పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో వైసిపి, జనసేన కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది.

ఎమ్మెల్యే బండారుపై అసహనం: వేపగుంటలో జరిగిన జన్మభూమి సభలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. శ్మశానాన్ని ఆక్రమిస్తున్నా అధికారులు, టిడిపి ఎమ్మెల్యే బండారు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని సభలో స్థానిక నాయకులు రాపత్తి కన్నా, ఎర్రా నాగరాజు నిలదీశారు. వెంటనే ఎమ్మెల్యే బండారు కలుగజేసుకొని సంక్షేమ పథకాల కోసమే జన్మభూమి అని, ఇక్కడ సమస్యలు మాట్లాడొద్దని చెప్పడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు.

గత జన్మభూమి కార్యక్రమంలో ఇచ్చిన హామీలు, వచ్చిన సమస్యలను పరిష్కరించకుండా ఇప్పుడు మళ్లీ జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించడంపై అరకులోయ మండలం చినలబుడు పంచాయతీ కేంద్రంలో జరిగిన జన్మభూమిలో స్థానిక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావును గిరిజనులు నిలదీశారు. మంచినీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జి.మాడుగుల గెమ్మిలిలో బాక్సైట్ జిఒను రద్దు చేయాలని, తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని, గిరిజన యూనివర్సిటీని నెలకొల్పాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పాడేరు మండలం బర్సింగి, డోకులూరు, బడిమెల, గొండెలి పంచాయతీల్లో జరిగిన గ్రామ సభల్లో గిరిజనులు, గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు పలు సమస్యలపై నిలదీశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, బాక్సైట్ తవ్వకాల జిఒను రద్దు చేయాలని, కొండ కుమ్మర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలని, విలేజ్‌మాల్స్ నిర్ణయాన్ని రద్దుచేసి జిసిసి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ముంచంగిపుట్టు మండలం మాకవరం, జోలాపుట్టు పంచాయతీ కేంద్రాల్లో జన్మభూమి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. తాగునీరు, రహదారి, ఉపాధి బకాయి సొమ్ములు, ఎన్‌టిఆర్, ఇందిరమ్మ గృహాల బిల్లుల కోసం మాకవరం గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు పంచాయతీలో రేషన్‌కార్డులు, పింఛన్లకు దరఖాస్తులు చేసుకున్నామని, ఇప్పటివరకు ఎందుకు మంజూరు చేయలేదంటూ ఆ పంచాయతీ గిరిజనులు ప్రశ్నించారు. పెదబయలు మండలం లక్ష్మీపేట, బొండపల్లి పంచాయతీల్లో గత జన్మభూమి సమస్యలనే పరిష్కరించకుండా, ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టకుండా కొత్తగా మళ్లీ జన్మభూమి నిర్వహించి ప్రయోజనమేమిటని గిరిజనులు ప్రశ్నించారు.

బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై..

బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై జన్మభూమి కార్యక్రమంలో గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడేరు మండలంలో జరిగిన గ్రామ సభల్లో బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయంపై తమ వైఖరిని తెలపాలని ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు నిలదీశారు. డుంబ్రిగుడ, జి.మాడుగుల మండలాల్లో జరిగిన సభల్లోనూ ఇదే అంశంపై గిరిజనులు నిలదీశారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చకూడదంటూ అరకులో సర్పంచ్ సిహెచ్.వెంకటరాజు, కొల్లాపుట్టులో సర్పంచ్ జమున, కొర్రాయిలో సర్పంచ్ గంగాధర్, సాగరలో సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యాన అఖిలపక్షం నాయకులు, గిరిజనులు తీర్మానం చేసి అధికారులకు తీర్మాన పత్రాన్ని అందించారు.

సిపిఎం నేతలు ముందస్తు అరెస్టు

నక్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు రావడంతో సిపిఎం నాయకులు ఎం.అప్పలరాజు, పి.వెంకటస్వామి, సత్యనారాయణ, దాసులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జన్మభూమి కార్యక్రమం ముగిసిన తరువాత వారిని విడుదల చేశారు. సభలో సక్రమంగా రుణమాఫీ చేయలేదని నక్కపల్లికి చెందిన రైతు కొల్నాటి అప్పారావు నిలదీయడంతో పోలీసులు ఆయనను కూడా అదుపులోకి తీసుకున్నారు.

మత్స్యకారులను ఎస్‌టిలో చేర్చేందుకు కృషి

ప్రజాశక్తి-కలెక్టరేట్

మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు గట్టిగా కృషి చేస్తానని దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మత్స్యకారుల ఎస్‌టి సాధన సమితి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 7వ రోజుకు చేరుకున్నాయి. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంకు చెందిన మత్స్యకారులు మంగళవారం నాటి దీక్షల్లో పాల్గొన్నారు. మహిళలు శిబిరం ఎదుట చేపలు అమ్మారు. శిబిరంలో కూడా నెత్తిపై చేపలతో ఉన్న పాత్రలను పెట్టుకొని, మత్స్యకారులు ధరించే టోపీలు, చేపలు పట్టే వలలు తదితర వృత్తి పరికరాలతో వినూత్నంగా దీక్షల్లో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గణేష్‌కుమార్ మాట్లాడుతూ, మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ఈ సరికే తాను అసెంబ్లీలో మాట్లాడినట్లు చెప్పారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని, లేకుంటే తానే స్వయంగా దీక్షకు దిగుతానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికవడానికి మత్స్యకారులు అందించిన సహకారమేనన్నారు.

వైసిపి నేతల సందర్శన

ఎమ్మెల్యే గణేష్‌కుమార్ వెళ్లిపోయాక వైసిపికి చెందిన పలువురు ముఖ్య నాయకులు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి నగర అధ్యక్షులు మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ, సముద్రంలో నిత్యం ప్రాణాలకు తెగించి చేపల వేటను సాగిస్తూ, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ వెనుకబడి ఉన్న మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్నారు. తెలుగుదేశం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో ఇంత వరకు చేర్చకపోవడం అన్యాయం అన్నారు. వారిని టిడిపి ఓటు బ్యాంకుగా వాడుకుని మోసగించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, విశాఖ పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు తైనాల విజయ్‌కుమార్, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా గురువులు, ఉత్తర ఇన్‌చార్జిలు సనపల పాండురంగారావు, సత్తి రామకృష్ణారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షులు గరికిన గౌరి, మత్స్యకారుల ఎస్‌టి సాధన సమితి నాయకులు గంగా పాపారావు, బుడ్డా నీలకంఠం, మూగి శ్రీరామమూర్తి, డి.రామకృష్ణ, మూగి సూర్యనారాయణ, మూగి రాముడు, తిరుపతి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి
దీక్షా శిబిరానికి పోటెత్తిన వైసిపి నేతలు



మత్స్యకారుల దీక్షలో మాట్లాడుతున్న తైనాల విజయకుమార్

ప్రజా సంక్షేమం కోసమే జన్మభూమి

ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి

ప్రజాశక్తి -కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం 'జన్మభూమి' కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి తెలిపారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం "జన్మభూమి -మా ఊరు" కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గాన్ని అని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుపుతానన్నారు. వికలాంగులకు కొత్తగా పింఛన్లు, అర్హులైన పేదలకు రేషన్ కార్డులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ ఎం.హరినారాయణన్, జోన్ -3 కమిషనర్ చక్రధర్, అధికారులు, 26వ వార్డు నాయకులు పాల్గొన్నారు.



జన్మభూమి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి



బహుమతి ప్రదానం చేస్తున్న డిఆర్ఎం మాథూర్

స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్

ప్రజాశక్తి-కలెక్టరేట్

తూర్పు కోస్తా రైల్వే, విసిటిపిఎల్ జట్ల మధ్య స్నేహ పూర్వక క్రికెట్ మ్యాచ్ రైల్వే స్టేడియంలో డిఆర్ఎం ఎంఎస్.మాథూర్ ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లో విసిటిపిఎల్ జట్టు 22 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచిన విసిటిఎల్ తొలుత బ్యాటింగ్ తీసుకొని నిర్ణీత 20 ఓవర్లకు గాను 173 పరుగులు చేసింది. ఇందులో వెంకటేష్ 42, రవితేజ 27 పరుగులు చేశారు. రైల్వే బౌలర్ ఎన్ఎన్.సింగ్ 37 పరుగులిచ్చి 3వికెట్లను తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తూర్పుకోస్తా రైల్వే జట్టు 20 ఓవర్లలో 151 మాత్రమే చేయగలిగింది. ఈ జట్లలో ఎన్ఎన్.సింగ్ 36, ఉదయ్ 21, హర్ష 23 (నాట్ అవుట్)గా నిలబడ్డారు. ఉత్తమ బ్యాట్‌మ్యాన్‌గా వెంకటేష్ 42, ఉత్తమ బౌలర్‌గా ఎన్ఎన్.సింగ్, ఉత్తమ ఫీల్డర్‌గా ప్రత్యూష్ నిలిచారు. అనంతరం ముఖ్య అతిథి డిఆర్ఎం.మాథూర్ విజేతలకు ట్రోఫీలను అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు.

వైద్య కమిషన్ బిల్లు రద్దుచేయాలని వైద్యుల ర్యాలీ

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్

జాతీయ వైద్య కమిషన్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ వైద్యులు విశాఖలో కెజిహెచ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) అధ్యక్షులు డాక్టర్ జయశేఖర్ వ ా ట ్ా ల డ ు ం త ు ా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మెడికల్ కౌన్సిల్‌ను రద్దు చేయడం సరికాదన్నారు. వైద్యులందరికీ అఖిల భారత కేడర్ సర్వీసు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయూష్ వైద్యులు అల్లోపతి రంగంలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) కార్యదర్శి డాక్టర్ కరుణామూర్తి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డాక్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పిడకల శ్యామ్ సుందర్, వైద్యులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

'894 గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దుచేయాలి

కలెక్టరేట్ : 894 గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ శ్రీ విజయదుర్గ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ఆధ్వర్యాన రైల్వేస్టేషన్ గేట్ వద్ద ఆటో డ్రైవర్లు మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎపి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ నగర గౌరవాధ్యక్షులు జి.వామనమూర్తి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పెనాల్టీలు పెంచుతూ విడుదలచేసిన 894 గెజిట్ నోటిఫికేషన్ వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరిగిన డీజిల్, థర్డ్ పార్టీ ఇన్స్యూరెన్స్ కట్టలేక అవస్థలు పడుతున్న ఆటో డ్రైవర్స్‌పై ఎఫ్‌సి పెనాల్టీ రోజుకు రూ.50, డ్రైవింగ్ లైసెన్స్ లేట్ ఫీజును రూ.50 నుంచి రూ.1000కు, రూ.320 ఉన్న ఎఫ్‌సి చలానాను రూ.700కు పైగా పెంచి ఆటో కార్మికుల ఆదాయానికి గండి కొడుతున్న గెజిట్ నోటఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించి ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైల్వేస్టేషన్ ఇన్‌గేట్ వద్ద ఆటోలకు పార్కింగ్ స్థలం ఇవ్వాలని, రైల్వేస్టేషన్ ఇన్‌గేట్‌కు ఎదురుగా వేసిన గ్రిల్స్‌ను తొలగించి ప్రయాణికులు బస్సులు, ఆటోలు ఎక్కే అవకాశం కల్పించాలని జివిఎంసి అధికారులను కోరారు. ఆర్‌టిఎ విభాగంలో పనులను ప్రయివేట్ ఇ-సేవ, మీ -సేవలకు అప్పగించి ఆటో డ్రైవర్లపై రూ.వేలల్లో భారాలు వేయడం ప్రభుత్వాలకు తగదన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టి, రింగ్‌రాజు, వై.వెంకటి, ఎ.రమేష్, బి.రవి, బి.దేవరాజు, హెచ్.శేఖర్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు పూలే 187వ జయంతి

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్

ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో ఈ నెల 3వ తేదీన సావిత్రిభాయి పూలే 187వ జయంతిని నిర్వహించనున్నట్లు సావిత్రిబాయిపూలే ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి తెలిపారు. సాయంత్రం 4గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి పివి.జ్యోతిర్మయి ముఖ్య అతిథిగా, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ జిసృజన, విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత డాక్టర్ ఎస్.విజయ్ కుమార్, ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వరరావు, ఎయు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ పివి.సుధాకర్ అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. నెల్లూరుకు చెందిన శివాజీ యూత్ వ్యవస్థాపకులు ఎం.భాస్కరనాయుడుకు సావిత్రిబాయి పూలే విశిష్ట సేవాసంస్థ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

నేడు సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్ : డాబాగార్డెన్స్ ప్రేమసమాజంలో ఈ నెల3వ తేదీన 'ఘంటసాల-పిబి శ్రీనివాస్ సూపర్ హిట్స్' పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు పాటే మీ మా ప్రాణం సినీ సంగీత సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగులాపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. సాయంత్రం 6గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు టివిఎల్.నరసింహారావు, విజయలక్ష్మి, సరస్వతి తదితరులు సుమధురగీతాలను ఆలపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరు ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

ఘనంగా అష్టదళ పద్మారాదన సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేట దరి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు మంగళవారం అష్టదళ పద్మారాధన సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. పూజ అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారికి చక్రనవవర్ణార్చన లక్ష్మీ హోమం నిర్వహించారు. అమ్మవారి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామ చంద్రస్వామి దేవాలయం నందు బుధవారం పునర్వశు నక్షత్రం సందర్భంగా స్వామివారికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్‌జె.మాధవి తెలిపారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులు రూ.300 చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.



రజకులకు సంక్షేమ పథకాలు అందించాలి

కంచరపాలెం : రజక వృత్తిదారులకు సంక్షేమ పథకాలు అందించాలని ఎపి రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎం.ఈశ్వరరావు కోరారు. కంచరపాలెం సిఐటియు భవనంలో మంగళవారం సంఘం అధ్యక్షులు పట్నాల వెంకటరమణ అధ్యక్షతన రజక వృత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, రజకులకు ఇళ్లు, దోబీఘాట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం కట్టించి ఇవ్వాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి
www.prajasakti.com
వి-శాఖ
బుధవారం 3
జనవరి 2018

29 ఏళ్ల నిరీక్షణ

- భర్తీకి నోచని సంగీతం, క్రాఫ్ట్ టీచర్ పోస్టులు
- ఈ ఏడాది డిఎస్‌సిలో మ్యూజిక్ టీచర్లకు అవకాశం
- అన్ని స్కూళ్లలోనూ క్రాఫ్ట్, పిఇటి తరగతులు

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో మ్యూజిక్, క్రాఫ్ట్, పిఇటి టీచర్ల భర్తీ దాదాపు 29 ఏళ్లుగా జరగడం లేదు. 1989లో ఈ పోస్టులను అప్పటి ప్రభుత్వం తీసేసింది. అప్పటి నుంచి పిఇటి విభాగంలో ఒకటి రెండు సార్లు తప్ప మిగతా వాటి జోలికి పోలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. రాష్ట్రంలో అన్ని చోట్లా ఈ పీరియడ్స్‌ను స్టడీ అవర్లలోకి మార్చేశారు. ప్రయివేటు పాఠశాలలైతే ఈ టీచర్ల భర్తీ ఊసెత్తడం లేదు. ఈ క్రమంలో ఓ కొత్త కబురు వినిపిస్తోంది. తాజాగా ప్రభుత్వం వైపు నుంచి మ్యూజిక్, క్రాఫ్ట్, డ్రాయింగ్, పిఇటి పోస్టుల భర్తీపై చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. టెట్ పరీక్షను త్వరలో ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇది రాసి పాసైతే.. తర్వాత వచ్చే డిఎస్సీకి వీరంతా అర్హతను సాధించనున్నారు. ఈ నేపథ్యంలో మ్యూజిక్, క్రాఫ్ట్, డ్రాయింగ్ పోస్టుల భర్తీకి ఈ సారి అవకాశం ఉండొచ్చన్నది తెలుస్తోంది.

వందల సంఖ్యలో ఖాళీలు

రాష్ట్ర వ్యాప్తంగా డ్రాయింగ్ టీచర్ల పోస్టులు 700, పిఇటి 436, క్రాఫ్ట్ 780 ఖాళీగా ఉన్నాయి. ఎలాంటి చర్యనూ ఇన్నేళ్లూ ప్రభుత్వం వీటి భర్తీకి తీసుకోలేదు. జిల్లా స్థాయి సెలక్షన్ కమిటీ (డిఎస్‌సి) ద్వారా జరిగే పోస్టుల భర్తీలో రెగ్యులర్ సబ్జెక్టులకే పరిమితమవుతున్నారు. రాష్ట్రంలోని విజయవాడ, విజయనగరం, హైదరాబాద్, రాజమండ్రి, కర్నూలు, గుంటూరు తదితర చోట్ల ప్రభుత్వ మ్యూజిక్ కాలేజీలున్నాయి. వీటిలో కూడా పోస్టులు భర్తీ కాలేదు. ఆయా కాలేజీల్లో సంగీతంలో డిప్లమోలు చేసిన వారు ఇప్పటికే వయస్సురీత్యా అర్హత కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది తీసే టెట్, డిఎస్సీలో వీరికోసం వయో సడలింపు అంశాన్ని కూడా ప్రభుత్వం ఆలోచిస్తుంది. సుమారు 45 సంవత్సరాల వరకూ మ్యూజిక్ పోస్టులకు అర్హతను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆయా ప్రభుత్వ సంగీత కళాశాలల్లో డిప్లమోలు పూర్తిచేసిన వారు టెట్ ఎగ్జామ్ రాయాల్సిన అవసరం ఉండదు. నేరుగా డిఎస్సీకి వారు హాజరుకావొచ్చన్నది సమాచారం.

ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువత

టీచర్ల పోస్టులకు అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులంతా ఈ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తే తమకు కొద్దో గొప్పో ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయని, మెయిన్ సబ్జెక్టులకే డిఎస్సీలు పరిమితం కాకూడదని చెబుతున్నారు. ఆర్ట్స్, మ్యూజిక్, ఫిజికల్ ఎడ్యుకేషన్ తరగతులు విద్యార్థుల మనస్సులపై చెరగని ముద్ర వేస్తాయని, విమర్శనాత్మక దృష్టిని, సామాజిక అవగాహనను పెంచుతాయని, ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేయడంతోనే నేడు సమాజంలో అనేక రుగ్మతలు సంభవిస్తున్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలంటే క్రాఫ్ట్, పిఇటి, సంగీతం విభాగాలకు ఉపాధ్యాయులను నియమించాలన్న డిమాండ్ పెరుగుతోంది.

విశాఖ జిల్లాలో చాలా పాఠశాలలకు మైదానాలు లేవు. కనీస వసతులు, భద్రతా అంశాలూ లేకపోయినా వాటిపై ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఉపాధ్యాయుల నియామకంలో కూడా తగిన మార్గదర్శకాలను ప్రయివేటు స్కూళ్ల పాటించకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు, కళాత్మక దృష్టిని అలవర్చేందుకు పై పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరముందని పలువురు భావిస్తున్నారు.


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు, సంగీత కళాకారుడు

సంస్మరణ
జోహార్లు కామ్రేడ్ సుబ్బారావు..

జోహార్లు కామ్రేడ్ సుబ్బారావూ
మరువలేము నీ స్ఫూర్తి ఎన్నటికీ మేము
"జోహార్లు"

యూనివర్సిటీ మెస్‌లో ఉద్యోగిగా..
సిఐటియు అభివృద్ధికి కృషి చేసినావూ

ప్రజానాట్య మండలిలో నాటకాలు వేసావు
డప్పుకొట్టి పాటపాడి చిందేసినావూ
"జోహార్లు"

కమ్యూనిస్ట్ సిద్ధాంతం గుండెల్లో నింపుకొనీ
కుటుంబాన్ని పార్టీకి అంకితం చేసినావూ



ఎర్ర జెండా అంటే
నీకు అమితమైన
ప్రేమా..
సిపిఎం పార్టీ
అంటే ఎనలేని
విశ్వాసం
"జోహార్లు"

సనాతన కుటుంబంలో పుట్టి పెరిగినావు
ప్రజల కొరకు ఎర్ర జెండా చేత బట్టినావూ
మాటలు చెప్పడమే కాదు ఆచరణలో చూపించీ
కడవరకూ ఎర్ర జెండా వదల్లేదు నీవూ
"జోహార్లు"

కార్యకర్తలింటికొస్తే ఆకలి తీర్చావు
ఉద్యమాల్లో తోడు నిలిచి జెండా మోసావూ

పార్టీ నిధి వసూళ్ళలో మమేకం అయ్యావూ
కర్తవ్య సాధనలో నీకు సాటిరారెవరూ..

- ఎం.చంటి

(ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగుల పోరాటాల్లో కీలకంగా నిలిచి, కుటుంబం యావత్తునూ అభ్యుదయభావాల జాడలో నడిపి క్యాన్సర్‌తో కన్నుమూసిన కామ్రేడ్ సుబ్బారావుకు జోహార్లు అర్పిస్తూ..)

ఘనంగా ఎన్ఎస్ఎస్ యువజనోత్సవాలు


పల్లెటూరి గొప్పతనం తెలియజెబుతూ నృత్యం చేస్తున్న విద్యార్థులు

క్యాంపస్ కబుర్లు


కూచిపూడి నృత్య భంగిమలో విద్యార్థిని


థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-మద్దిలపాలెం, విశాఖ

ఆంధ్ర యూనివర్సిటీలోని టిఎల్ఎన్ సభా మందిరంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యువజనోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విసి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశవికాసాన్ని కోరుకుంటూ యువత పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని బహిరంగ మల విసర్జన రహితంగా తీర్చిదిద్దడానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి ఎంతో అవసరమన్నారు. నిర్దిష్ట లక్ష్యంతో పని చేస్తూ, విద్య, కళలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాయకత్వం, సేవా రంగాలలో యువత ముందుండాలని సూచించారు. యువత సామర్థ్యాలను గుర్తించి, ప్రోత్సహించే వేదికగా ఈ ఉత్సవాలు నిలుస్తాయని చెప్పారు. గ్రామాలను ఒడిఎఫ్‌గా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తగిన తోడ్పాటును అందించాలని కోరారు. రెక్టార్ ఆచార్య కె.గాయిత్రి దేవి మాట్లాడుతూ సమైక్యతకు చిహ్నంగా ఎన్ఎస్ఎస్ నిలుస్తోందన్నారు. వలంటీర్లు రోల్‌మోడల్స్‌గా నిలవాల్సిన అవసరం ఉందని బాధ్యతను గుర్తు చేశారు. సమ్మిళిత ప్రగతికి నమూనాగా ఎన్ఎస్ఎస్ నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య ఆర్‌డి సంపత్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా డిపిఒ సూర్యనారాయణ, ప్రోగ్రాం అధికారులు, విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జ్ఞాన ప్రదాతలు.. మహిళా ఉపాధ్యాయులు

- జిల్లాలో 5200 మంది సేవలు
- నేడు జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



పాఠాలు బోధిస్తున్న మహిళా ఉపాధ్యాయిని

ప్రజాశక్తి - మద్దిలపాలెం, జిల్లా పరిషత్

అఆలు నేర్పిన దగ్గర నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకూ పాఠం చెప్పిన ప్రతిఒక్కరూ గురువే. గురువంటే మార్గదర్శి. ద గైడ్. ఓ వ్యక్తిని జీవనయానంలో ఉన్నత స్థానంలో నిలబెట్టడానికి ఆయనతో అక్షరాలు దిద్దించి, వెన్నంటి ఉండి అభివృద్ధికి దోహదపడేవారే ఆచార్యులు. వీరిలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర అమోఘమైనది, అనిర్వచనీయమైనది. భారతదేశంలో గురువంటే ఎలా ఉండాలో, శిష్యులపై ఎలాంటి ముద్రవేయాలో సర్వేపల్లి రాధాకృష్ణ, సావిత్రిబాయి పూలేలు ఆచరించి చూపారు. అందుకే గురువులంటే తొలుత వారే గుర్తుకు వస్తారు. ముఖ్యంగా నాటి కాలంలో అనేక ఒడుదుడుకులను, నిర్బంధాన్ని, వివక్షను ఎదుర్కొని కడదాకా నిలిచారు సావిత్రి బాయి పూలే. ఆమె పుట్టిన రోజును జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా యావత్తు దేశం జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో ఆమె గొప్పతనాన్ని, జిల్లాలోని మహిళా ఉపాధ్యాయినిల పరిస్థితిని తెలియజేసేదే ఈ కథనం..

దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే చరిత్రలోకెక్కారు. తొలి మహిళా పాఠశాలను ప్రారంభించిన ఆమె గొప్ప విద్యాబోధన చేశారు. ప్రముఖ సంఘసేవకుడు జ్యోతిరావ్‌పూలే భార్యగా సమాజ సేవలో పాలు పంచుకున్నారు. సావిత్రిబాయి ఆ కాలంలో మహిళా విద్య గురించి ఎంతో తపించారు. దళితవర్గంలో పుట్టి తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొని బ్రిటిష్ వారి కాలంలో మహిళల హక్కుల కోసం పోరాడారు. ఆ కాలంలో స్త్రీలను బయటకు వెళ్లనిచ్చేవారు కాదు. కానీ సావిత్రిబాయి పూలే బాలికలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చారు. అప్పటి ఛాందసులు ఆమెపై కుళ్లిన గుడ్లు, మాంసం, టమాటాలు, రాళ్లు విసిరి హింసించారు. అయినప్పటికీ జంకకుండా ధైర్యంగా విద్యాబోధన చేశారు. ఆమె భర్త పూర్తి అండగా ఉంటూ ప్రోత్సహించారు. దీంతో ఆమె దేశంలోనే మహిళల కోసం 1848లో తొలి పాఠశాలను ప్రారంభించి అక్కడే మొదటి ఉపాధ్యాయినిగా పాఠాలు బోధించారు. మొదట వివిధ కులాలకు చెందిన తొమ్మిది మంది బాలికలు ఆమె పాఠశాలలో చేరి చదువుకున్నారు. ఆ తర్వాత సమాజంలో కొంత మార్పు వచ్చి తల్లిదండ్రులు తమ అమ్మాయిలను చదువుకునేందుకు పాఠశాలకు పంపించడం ప్రారంభించారు. దీంతో సావిత్రిబాయి మహిళల కోసం మరో ఐదు పాఠశాలలను ప్రారంభించారు. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్‌లాంటి దళిత కులాలకు చెందిన చిన్నారులను చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి 1897 మార్చి 10న మృతిచెందారు. ఇంతలా స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేసిన ఆమెను చివరకు బ్రిటిష్ ప్రభుత్వమే ఘనంగా సత్కరించడం విశేషం. సావిత్రిబాయి పూలే జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రతి ఏటా జరుపుకుంటున్నాం.

చరిత్రలో నేడు


సావిత్రిబాయి పూలే


బొమ్మల ద్వారా జ్ఞానాన్ని పంచుతున్న ఉపాధ్యాయిని

జిల్లాలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర

జిల్లాలో మొత్తం 13 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అందులో 5200 మంది మహిళా ఉపాధ్యాయులు. 40 శాతంగా ఉన్న వీరు జిల్లా విద్యాభివృద్ధిలో ఎనలేని కృషి చేస్తున్నారు. ముఖ్యంగా టెన్త్‌లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి అదనపు సమయాన్ని కూడా వెచ్చించి విద్యాబోధన చేస్తున్నారు. మరోపక్క పాఠశాలలో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా అగ్రభాగాన ఉంటూ మొత్తం భారాన్ని తమపై వేసుకుంటున్నారు. మహిళా విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటూ మానసికంగా వారు ఎదగడానికి దోహదపడుతున్నారు. ఇటు ప్రయివేటు విద్యాసంస్థల్లోనూ వీరి పాత్ర గొప్పదనే చెప్పాలి.

విద్యను కళాత్మకంగా తీర్చిదిద్దడంలో వారిదే కీలకపాత్ర

విద్యను కళాత్మకంగా తీర్చిదిద్దడంలో మహిళా ఉపాధ్యాయులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఓర్పుతో, సహనంతో మెలుగుతూ మంచి ఉత్తీర్ణత కోసం తోడ్పాటు అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 40 శాతం మంది మహిళా ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

- బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

నిత్య స్ఫూర్తి సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలే దేశంలో స్త్రీ విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. ఆమె స్ఫూర్తితో నేడు అనేక మంది మహిళలు ఉన్నత విద్యలభ్యసిస్తున్నారు. పురుషులతో సమానంగా అనేక బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించడానికి ముందుకు వస్తున్నారు. అయినప్పటికీ స్త్రీ అణచివేతకు గురవుతూనే ఉంది. ముఖ్యంగా గ్రామీణ మహిళల్లో అక్షరాస్యతా శాతం పెరగాల్సిన అవసరముంది. మనకు ప్రథమ గురువు అమ్మే అంటారు. అలాంటి అమ్మలు పూర్తిగా విద్యావంతులవ్వాల్సిన అవసరముంది. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల మహిళలు చదువులకు దూరంగా ఉంటున్నారు. కేవలం అక్షరాస్యతతోనే సరిపోదు. ఉన్నత విద్యలందుకోవాలి. అటువంటి అవకాశాలను ప్రభుత్వాలు కల్పించాలి. కేవలం విద్యతోనే మహిళలు దేన్నైనా సాధించగలరు. దేశంలో పురుషులతో సమానంగా ఉన్న స్త్రీలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచాల్సిన అవసరముంది. స్త్రీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి.

ఆచార్య ఎం.నళిని,
పొలిటికల్ సైన్స్ విభాగం సీనియర్ ఆచార్యులు, ఆంధ్ర యూనివర్సిటీ

అలరించిన శ్రీకృష్ణలీలలు

132 ఏళ్లగా సురభి నాటకాలు : వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- మునగపాక

సురభి నాటక సమాజం ప్రదర్శించిన శ్రీకృష్ణ లీలలు నాటకం విశేషంగా అలరించింది. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ 61వ జన్మదినం సందర్భంగా మంగళవారం నుండి మూడు రోజుల పాటు సురభి నాటకాలు మునగపాకలో ప్రదర్శిస్తున్నారు. అందులో భాగంగా తొలిరోజు శ్రీకృష్ణలీలలు నాటకాన్ని ప్రదర్శించారు. సినీ సెట్టింగ్‌లతో ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రేక్షకులకు అసౌకర్యం కలగకుండా టెంట్లు, కూర్చొని చూసే విధంగా ఒక సినిమా హాలు పక్కీలో ఓపెన్ ఆడిటోరియంలా కూర్చీలు ఏర్పాటు చేశారు.

దీనికి ముందు ప్రారంభ కార్యక్రమంలో సురభి నాటక సమాజం నిర్వాహకుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే 132 సంవత్సరాలుగా నాటకాలు కొనసాగిస్తున్న ఏకైక సంస్థ సురభి నాటక సమాజమని చెప్పారు. 1885లో కడప జిల్లాలో సురభి గ్రామంలో మెట్టమొదటి ప్రదర్శనగా కీచక వధా అనే నాటకంతో ప్రారంభమైన ఈ సంస్థ నేటి వరకు కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలోనే కాకుండా దేశ విదేశాల్లో కూడా సురభి నాటకాల ప్రదర్శన కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మిగతా నాటకాలు డైలాగులు ప్రధానంగా ఉంటాయని, సురభి నాటకాలు దృశ్యం ప్రధానం కొనసాగుతున్నాయని చెప్పారు. సురభి నాటకాలను కన్ను ఆర్పకుండా చూసే విధంగా ఆసక్తి కలిగిస్తాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుకూలంగా సరికొత్త టెక్నాలజీతో నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు.

క్రమ శిక్షణ, సమయపాలన కొనసాగించడంతో ఈ సురభి నాటకాలు విజయవంతంగా ఖ్యాతి పొందుతున్నాయని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా సురభి నాటకాలు ప్రోత్సహిస్తూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పెంటకోట రమణబాబు, కాండ్రేగుల చందు, నేమాల పూర్ణ, మునగపాక మండల కొణతాల అభిమానులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణ లీలలు నాటకంలోని ఓ సన్నివేశం

'వైసిపి గెలుపునకు సమిష్టి కృషి అవసరం'

ప్రజాశక్తి-సీతమ్మధార

రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సమిష్టింగా పనిచేయాలని వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్తలు సత్తి రామకృష్ణారెడ్డి, సనపల చంద్రమౌళి, పసుపులేటి ఉషాకిరణ్ సూచించారు. జివిఎంసి 32వ వార్డులో ఇటీవల నియమించిన 22 బూత్ కన్వీనర్లకు మంగళవారం ముస్లిం తాటిచెట్లపాలెంలో వార్డు అధ్యక్షుడు కెవి.బాబా కార్యాలయంలో గుర్తింపు కార్డులు, శిక్షణ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీకి బూత్ కన్వీనర్లు స్తంభాలాంటివారని, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయడానికి కృషి చేయాలని కోరారు. 2018 సంవత్సరం చాలా కీలకమని, ఈ ఏడాది కష్టపడి పార్టీ అభివృద్ధికి శ్రమించాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రకు మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కెవి.బాబా, ఎవిఎన్.నాయుడు, ఆళ్ల శివగణేష్, రమణబాబు, కె.ప్రసాద్, వి.ప్రసాద్, అలివేణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని 4వ పట్టణ ట్రాఫిక్ సిఐ దుర్గా ప్రసాద్ కోరారు. శంకర మఠం రోడ్డు వద్ద మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్సు లేనివారు, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదుచేశారు. వాహనదారులకు ట్రాఫిక్‌పై ఆయన పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ భరత్‌కుమార్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాఫిక్‌పై సూచనలిస్తున్న సిఐ దుర్గాప్రసాద్

'రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషి'

37వ వార్డు జన్మభూమిలో గంకల

ప్రజాశక్తి-కంచరపాలెం

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు అహర్నిషలూ శ్రమిస్తున్నారని జివిఎంసి 37వ వార్డు టిడిపి అధ్యక్షులు గంకల అప్పారావు పేర్కొన్నారు. వార్డు పరిధి బాపూజీనగర్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం జన్మభూమి-మావూరు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చంద్రబాబు సందేశాన్ని టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వినిపించారు. అనంతరం గంకల అప్పారావు మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు, డ్వాక్రా మహిళా సంఘాలు, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జన్మభూమి-మావూరు కార్యక్రమంలో మాట్లాడుతున్న గంకల అప్పారావు



శరీర సౌష్టవ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గురునాథరావు తదితరులు

7 న శరీర సౌష్టవ పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార

విశాఖ-2018 శరీర సౌష్టవ పోటీలను ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.గురునాథరావు తెలిపారు. విశాఖ పౌర గ్రంథాలయంలో జనజాగరణ సమితి, విశాఖ జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గురునాథరావు మాట్లాడుతూ స్వామివివేకానంద 155వ జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి అనకాపల్లి రైల్వేస్టేషన్ రోడ్డు కోట్నివీధి, రామాలయం వద్ద బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పీలా గోవింద్, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. 50 కిలోల నుంచి 75 కిలోల పైన 7 విభాగాల్లో బిల్డర్స్ పాల్గొంటారని తెలిపారు. ప్రతి విభాగంలో ఐదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9553115056, 9966860419 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనజాగరణ సమితి జిల్లా అధ్యక్షుడు జి.స్వరూప్, ఎన్‌పిడి జోనల్ ఇన్‌చార్జి రాజు, అనుదీప్, కె.దామోదరగుప్తా, మహమ్మత్, మహేంద్రరెడ్డి, సాయికిరణ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-పెందుర్తి, వేపగుంట

అర్హులందరికీ సంక్షేమ పథకాలనందించడమే జన్మభూమి కార్యక్రమం లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఎస్ఆర్.పురంతోపాటు పలు గ్రామాల్లో మంగళవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలు, కులాలు, మతాలకతీతంగా ప్రభుత్వ పథకాలందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమన్నారు. విభజన కష్టాలున్నప్పటికీ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి కృషి చేస్తున్నారని చెప్పారు.

నిలదీతలు

అనర్హులకు పక్కాఇళ్లు, పింఛన్లు ఇచ్చి పేదలకు అన్యాయం చేస్తున్నారని కొందరు మహిళలు ఎమ్మెల్యేను, అధికారులను నిలదీసారు. ఆ సమయంలో అక్కడ గందరగోళం నెలకొంది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని మహిళలకు నచ్చజెప్పి అక్కడినుంచి పంపించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, తహశీల్దారు, ఎంపిడిఒ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జన్మభూమిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే బండారు

పెందుర్తి

ప్రజా సంక్షేమమే టిడిపి లక్ష్యం

వేపగుంట : ప్రజా సంక్షేమమే టిడిపి ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం వేపగుంట హైస్కూల్ ప్రాంగణంలో 5వ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విడదీసినప్పుడు సుమారు రూ.17 వేల కోట్లు లోటు బడ్జెట్ ఉందని తెలిపారు. ఈ పరిస్థితులనుంచి గట్టు ఎక్కించేందుకు 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు అధికారం కట్టబెట్టారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. అనంతరం కొత్త రేషన్ కార్డులు, చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరవ జోన్ కమిషనర్ చుక్కా సత్యనారాయణ, టిపిఒ ప్రసాదరావు, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీవిద్య, సూపర్ వైజర్ అచ్యుత్, ప్రజారోగ్య వైద్యాధికారి కెవిఎస్.జ్యోతి, రెవెన్యూ ఎసిఎం లక్ష్మి, టౌన్‌ప్లానింగ్ ఎఇ రామలింగారెడ్డి, ప్రభుత్వ హోమియో వైద్యులు మోహన్ పాల్గొన్నారు.

స్లిపర్ కార్మికులకు బోనస్ చెల్లించాలి

ప్రజాశక్తి-పెందుర్తి

స్లిపర్ కార్మికులకు వెంటనే బోనస్ చెల్లించాలని సిఐటియు నాయకులు జి.అప్పలరాజు డిమాండ్‌చేశారు. బోనస్ చెల్లించాలని కోరుతూ స్లిపర్ కంపెనీలో కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు పండగ బోనస్, క్యాజువల్ సెలవులు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, రోజుకు ఇచ్చే వేతనం రూ.250నుంచి రూ.350కి పెంచాలని, వేతనాలను సకాలంలో చెల్లించాలని డిమాండ్‌చేశారు. సిఐటియు నాయకులు అప్పలనాయుడు, జనరల్ సెక్రటరీ జి.శంకరావు, ప్రెసిడెంట్ ఆర్.మాధవరావు, వైస్‌ప్రెసిడెంట్ కె.అప్పలనాయుడు, జి.నగేష్, అంజియ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న స్లిపర్ కంపెనీ కార్మికులు

ప్రజల సమస్య పట్టదా?

ఎమ్మెల్యే బండారుపై అసహనం

ప్రజాశక్తి- వేపగుంట

ప్రజల సంక్షేమమే టిడిపి లక్ష్యమని ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్న బండారుకు ప్రజా సమస్యలు పట్టవా అని స్థానిక నేతలు మంగళవారం నాటి జన్మభూమిలో నిలదీశారు. జివిఎంసి 69వ వార్డు పరిధి కృష్ణానగర్‌లోని శ్మశాన వాటికలో కొంత భాగాన్ని ఆక్రమించి ఎల్‌జి.పాలిమర్స్ సంస్థ మంగళవారం ఫెన్సింగ్ వేస్తుంది. దీన్ని జన్మభూమిలో తెలిపేందుకు స్థానిక నాయకులైన వార్డు మాజీ సభ్యుడు రాపర్తి కన్న, మార్కెటింగ్ మాజీ సభ్యుడు, 69వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు యర్రా నాగరాజు అక్కడికి చేరుకున్నారు. ఈ సమస్యను వివరించేందుకు స్టేజిపైకి వెళ్లారు. దీంతో ఎమ్మెల్యే బండారు లేచి ఈ సమస్యను ఇప్పుడు ప్రస్తావించవద్దని, తరువాత మాట్లాడుకుందామని చెబుతూ ముందు స్టేజి దిగి వెళ్లిపోవాలని కన్న, నాగరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్మభూమిలో సంక్షేమంమీదే ప్రస్తావించాలన్నారు. జన్మభూమి కార్యక్రమాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఎమ్మెల్యే వారిపై విరుచుకుపడ్డారు. దీంతో ప్రజా సమస్యపై తెలియజేయడానికి వస్తే ఎమ్మెల్యే ఈ విధంగా వ్యవహరించడం సరికాదంటూ కన్న, నాగరాజులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివాదానికి చోటు చేసుకున్న సమయంలో మాజీ సర్పంచి, టిడిపి సీనియర్ నాయకుడు గంట్ల పెంటారావు కలగజేసుకుని ఎమ్మెల్యే బండారుకు సమస్యను వివరించారు. దీంతో ఎమ్మెల్యే ఈ విషయం చెప్పుకోడానికి స్టేజీ మీదకు రానవసరం లేదని, తనకు ఫోన్‌లో తెలియజేసినా, లేకుంటే కార్యక్రమం అయిపోయిన తరువాత చెప్పినా పరిష్కరిస్తానని చెప్పారు. అంతేగాని జన్మభూమి కార్యక్రమాలను ఇలా రసాభాసకు ప్రయత్నించడం సరికాదని ఎమ్మెల్యే హెచ్చరించారు.



నిలదీస్తున్న స్థానిక నేతపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న బండారు



వినతి ఇస్తున్న గంగారావు తదితరులు

దళితులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-పెందుర్తి

దళితులకు న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్‌కు సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, జెర్రిపోతులపాలెంలో దళితులను వివక్షతకు గురిచేసిన వారిని శిక్షించాలని, 14 మంది దళిత కుటుంబాలకు నష్టపరిహారం, భూములు ఇవ్వాలని, ఎపి బేవరేజస్‌లో ఉగ్యోగ అవకాశం కల్పించాలని, సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో దళితులకు ఇళ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి రమణి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

5వ విడత జన్మభూమి ప్రారంభం



కంచరపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, వుడా వీసీ

ప్రజాశక్తి-యంత్రాగం

గోపాలపట్నం : స్థానిక ఇందిరానగర్‌లో జన్మభూమి-మావూరు కార్యక్రమాన్ని అధికారులు తెలుగుదేశంపార్టీ నాయకులు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు వియ్యపు మూర్తియాదవ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ప్రజలు అధికారుల చుట్టు తిరిగేవారని అన్నారు. కానీ తమ ప్రభుత్వంలో అధికారులే ప్రజల వద్దకు వస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వం ఈ జన్మభూమి సభల ద్వార 4 లక్షల పించన్లు, లక్షన్నర రెషన్‌కార్డులు మంజూరి చేయనున్నదని తెలిపారు. అలాగే డ్వాక్రా సంఘాలకు వడ్డీ రుణమాఫీ కింద రూ. 780 కోట్లు మంజూరి చేయనున్నదని వివరించారు. దీనికి ముందు సిడిఒ పద్మవతి తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం పోలీసుస్టేషన్ ఎస్ఐ శ్రీనువాసరావు, టిడిసి నాయకులు నారిపిన్ని సత్తిరాజు, కెవి బాలసుబ్రహ్మణ్యం, పిడుగు మంగలక్ష్మీ, నానేపల్లి జయశంకర్, కనకకుమార్, బొడ్డేటి ఈశ్వరావు, దొడ్డి రాము, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కంచరపాలెం: 5వ విడత జన్మభూమి కార్యక్రమాలు 43, 36 వార్డులకు సంబంధించి కంచరపాలెం మెట్టు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గణబాబు జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీ ఎస్. రమణమూర్తి అధ్యక్షతన ముందుగా జన్మభూమి ప్రతిజ్ఞ చేయిచిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉడా వీసీ బసంత్ కుమార్, మురళీమోహన్, డిఇ రాంబాబు, ఇఇ చిరంజీవి, ఎంపిడిఒ చిట్టిబాబు, 43వ వార్డు అధ్యక్షులు సరగడం రాజశేఖర్ పాల్గొన్నారు.



గోపాలపట్నంలో మాట్లాడుతున్న సిఇఒ పద్మావతి

45 నుంచి 49వ వార్డులో జన్మభూమి ప్రారంభం

ప్రజాశక్తి-మల్కాపురం: జివిఎంసి 45, 49 వార్డులలో ఎకెజి కాలనీ ములగాడ, హిమాచల్‌నగర్, అశోక్‌నగర్, మల్కాపురం ప్రాంతాలు ఆ ప్రాంత వార్డు సీనియర్ నాయకుల, వార్డు అధ్యక్షులు ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు నాయకత్వంలో జన్మభూమి మా ఊరు కార్యాక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. 45వ వార్డు ఎకెసి కాలనీలో వార్డు అధ్యక్షులు కార్యదర్శులు, పిల్లా అచ్చారావు, జి కృష్ణారావు, ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల సమస్యలను దరఖాస్తులను స్వీకరించారు. 46వ వార్డులో ములగాడ ప్రాంతంలో వార్డు సీనియర్ నాయకులు శీరపు పైడిరాజు, వార్డు అధ్యక్షులు కోరాడ శ్రీనువాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శీరం పైడిరాజు మాట్లాడారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. జివిఎంసి 47వ వార్డు పరిధి హిమాచల్ నగర్‌లో వార్డు అధ్యక్షులు కార్యదర్శులు అల్లాబోయిన వంశీకిషోర్ యాదవ్, రేవల సత్యనారాయణ ఆధ్వర్యంలో జన్మభూమి - మాఊరు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలపై వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి అధికారులను ఆదేశించారు. జివిఎంసి 48వ వార్డు పరిధి అశోక్‌నగర్ వార్డు అధ్యక్షులు, కార్యదర్శులు కోరిబిల్లి రాము, జయశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 49వ వార్డు పరిధి మల్కాపురం వార్డు అధ్యక్షులు కార్యదర్శులు మజ్జి సోమేష్, డాలరు సన్యాసిరావు, ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్ఆర్ రాజు, బర్రి సూర్య ప్రకాష్, ప్రభావతి, నక్కా లక్ష్మణరావు, దేవర ఈశ్వరరావు, పెంటకోట అప్పలనాయుడు, జిల్లాని, జోజి, శ్రీలక్ష్మీ, జివిఎంసి వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



మల్కాపురంలో జన్మభూమి సభలో నాయకులు, అధికారులు



విజయ్ ప్రసాద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నాగేశ్వరరావు

కష్టపడి పనిచేస్తే గుర్తింపు : మళ్ల

ప్రజాశక్తి-మల్కాపురం

వైఎస్ఆర్‌సిపిలో ప్రతి కార్యకర్త, నాయకులు కష్టపడి పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని పార్టీ నగర అధ్యక్షులు మళ్ల విజయ ప్రసాద్ అన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా జివిఎంసి 45వ వార్డు వైఎస్సార్‌సిపి అధ్యక్షులు గుండపు నాగేశ్వరావు మళ్ల నివాసం వద్ద వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. మళ్ల స్పందించి నాగేశ్వరరావును అభినందించారు. ఈ సందర్భంగా మళ్ల విజయ ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వారది నారాయణరావు, గేదెల రమణ, తదితరులు పాల్గొన్నారు.



చంద్రన్న కానుకలు అందస్తున్న ఎంపిపి కృష్ణవేణి

చంద్రన్న సంక్రాంతి సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-భీమునిపట్నం

మండలంలోని మూలకుద్దు గ్రామంలో రేషన్ డిపో ద్వారా చంద్రన్న సంక్రాంతి కానులకను తెలుపు రేషన్ కార్డుదారులకు ఎంపిపి యరబాల కృష్ణవేణి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసిసరగడ అప్పారావు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి : పట్టణంలోని దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సిపిఎం నాయకులు విడుదల చేశారు. సిపిఎం నాయకులు ఎ బాలకృష్ణ మాట్లాడుతూ జనవరి 6 నుండి 8 వరకు అచ్యుతాపురంలో జరగనున్న సిపిఎం పార్టీ 22వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘం నాయకుడు మళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్ఇజెడ్‌లో కార్మికుల ప్రయోజనాల కోసం చట్టాల అమలు కోసం సిపిఎం అనేక ఉద్యమాలు ద్వారా విజయాలు సాధించిందన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు మాట్లాడుతూ 6వ తేదీ అచ్యుతాపురం జంక్షన్‌లో జరిగే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. పెంటకోట జగన్నాథం,ఎం.బాస్కరరావు పాల్గొన్నారు.

60వేల మొక్కలు పంపిణీకి చర్యలు

అనకాపల్లి : ఈ ఏడాది 60వేల మొక్కల పంపిణీకి సిద్ధంగా గ్రీన్ క్లబ్ పని చేస్తుందని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న వినాయక ఆలయం వద్ద గ్రీన్‌క్లబ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం పరిశుభ్రత, పచ్చదనం కోసం పట్టణ పరిధిలో పని చేస్తున్న పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంద్రేగుల సత్యనారాయణ, మాజీ ఫారెస్ట్ రేంజ్ బీరా వినోద్‌కుమార్, క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరరావు, కొడమంటిలి వెంకట శివాజీ, కొయిలాడ వెంకట శివాజీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పిసిల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విశాఖపట్నం

కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు హెచ్‌పిసిల్ ఉద్యోగులు బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గత నెల 28వ తేదీనుంచి 3వ తేదీవరకూ వారం రోజుల పాలటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. లాంగ్ టైం సెటిల్‌మెంట్‌లు, ఐఆర్ చెల్లించాలని, సిడిపి ప్రకారం రావాల్సిన ఆఫీసర్ల వేకెన్సీలు వెంటనే విడుదల చేయాలని కొత్త రిక్రూట్ మెంట్‌ల భర్తిలకు మరిన్ని డిమాండ్‌లకు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకత్వం వహించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆరిలోవ:బిఆర్‌టిఎస్ రోడ్డు దీనదయాల్‌పురం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకుపై వస్తున్న ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ కాలనీ, నలభై గజాలు ప్రాంతానికి చెందిన అవినాష్ (18), పండు(18) ఇద్దరు యువకులు స్కూటీపై పెదగదిలి నుండి వస్తున్నారు. బిఆర్‌టిఎస్ రోడ్డు దీనదయాల్‌పురం కూడలి వద్ద ఆరిలోవ కాలనీ వైపు మలుపులో అతివేగంతో వస్తున్నారు. ముడసర్లోవ పార్కు నుండి పెదగదిలి వస్తున్న కారుని ఢీకొట్టారు. దీనితో కారు మందు భాగం నుజ్జయ్యింది. బైకుపై వస్తున్న ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

డిసిఐ ప్రయివేటీకరిస్తే ఊరుకోం : సిఐటియు

ప్రజాశక్తి-గోపాలపట్నం

డిసిఐ ప్రైవేటికరిస్తే ఊరుకోం అని సిపిఎం గోపాలపట్నం డివిజన్ కార్యదర్శి డి.అప్పలనాయుడు అన్నారు. బుచ్చిరాజుపాలెం, ఎపిఎస్ఇబి కాలనీ, బాజీ జంక్షన్ ప్రాంతాల్లో సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిసిఐని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించాలని చూడడం సరికాదన్నారు అన్నారు. దీనిపై ఈ నెల 5న అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు ప్రజా బ్యాలెట్‌ను నిర్వహిస్తున్నాయని, 6న బ్యాలెట్ ఫలితాలు మీడియా సమక్షంలో ప్రకటిస్తాయని తెలిపారు. ఇప్పటికే డిసిఐ ఆస్తులను కారుచౌవకగా అమ్మటానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా డిసిఐ ఉద్యోగులు అఖిలపక్ష కార్మిక సంఘాలు అందోళన చేస్తున్నాయని గుర్తుచేశారు. డిసిఐ ఆందోళనను ఒక్క బిజెపి ప్రభుత్వం మినహా అన్ని రాజకీయ పార్టీలు బలపరుస్తున్నాయని తెలిపారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఉండవు, ఇందులో రావల్సిన 10వేల ఉద్యోగాలు ఉండవని వివరించారు. విశాఖలో ఒక ప్రభుత్వరంగ మణిహారం కోల్పోతాంమన్నారు. ఇప్పటికే హిందుస్థాన్ జింక్ మూతపడిందని, ప్రైవేటు విదేశి డ్రెడ్జింగ్ కంపెనీల వలన దేశ భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. లాభాల్లో నడిచే ప్రభుత్వ రంగ సంస్థలను ఎందుకు ప్రైవేట్ పరం ఎందుకు చేస్తుందో ప్రభుత్వం సమాదానం చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియ నాయుకులు బి.వెంకటరావు, ఐద్వా నాయకురాలు వి.ప్రభావతి, సిఐటియు నాయకులు సూర్యనారాయణ, కాగిత అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సిఐటియు నాయకులు

'హౌస్ కమిటీ' పరిష్కార ఘనత టిడిపిదే

ప్రజాశక్తి-గాజువాక

ఎన్నో సంవత్సరాలు పెండింగ్‌లో ఉన్న గాజువాక హౌస్ కమిటీ సమస్యను టిడిపి అధికారంలోకి వచ్చాక పరిష్కారమైందని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 59వ వార్డు పరిధి తుంగ్లాంలో మంగళవారం జన్మభూమి-మావూరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని చెప్పారు. భూగర్భ జలాలు అడుగంటకుండా ఉండాలనే తుంగ్లాంలో రూ.50 లక్షల వ్యయంతో పాత చెరువును అభివృద్ధి చేశామని తెలిపారు. ఎపిఐఐసిలో భూములు కోల్పోయిన మిగిలిన ఉన్న రైతులకు కూడా నష్టపరిహారం అందజేస్తామని చెప్పారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు కొత్తగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రేషన్‌కార్డులు లేనివారు ఈ జన్మభూమిలో దరఖాస్తుచేసుకుంటే ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, గాజువాక తహశీల్దార్ వేణుగోపాల్, జివిఎంసి అధికారులు ప్రసాదరాజు, వెంకటరావు, ఈశ్వరప్రసాద్, ఎస్ఇ భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



జన్మభూమి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ఉక్కు జూనియర్ ట్రైనీ రీ టెస్ట్ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-ఉక్కునగరం

ఉక్కు కర్మాగారంలో జూనియర్ ట్రైనీ పోస్టుల భర్తీకి సంబంధించి రీ టెస్ట్ షెడ్యూల్‌ను యాజమాన్యం మంగళవారం విడుదలచేసింది. గతేడాది నిర్వహించిన పరీక్షను రద్దుచేసిన సంగతి తెలిసిందే. మరిన్ని వివరాలకు వైజాగ్‌స్టీల్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని యాజమాన్యం పేర్కొంది.

చంద్రన్న బీమా పంపిణీ

పెదగంట్యాడ : జివిఎంసి 52వ వార్డు పరిధి బర్మాకాలనీలో కె.ఈశ్వరరావు మృతిచెందడంతో ఆయన కుటుంబానికి చంద్రన్న బీమా రూ.5 వేలును మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో బొసెట్టి అప్పారావు, జిత్తిక రాజు, ములకలపల్లి ఈశ్వరరావు, ఎస్.అప్పలరాజు, శివ, సత్యారావు, కృష్ణారావు, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 48 మంది ఎంపిక

గాజువాక : గాజువాక పరిధి శ్రీనగర్‌లో ఉన్న టిఎస్ఆర్, టిబికె కళాశాలలో ఐసిఐసిఐ బ్యాంక్ నిర్వహించిన ప్రాంగణనియామకాల్లో 48మందిని ఎంపికచేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.విష్ణువర్ధనావు తెలిపారు. 80 మంది విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ అభినందించారు.

శిష్టకరణాల అభివృద్ధికి తోడ్పాటు అవసరం

కూర్మన్నపాలెం : శిష్టకరణాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందించాలని శిష్టకరణాల అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు కోరారు. కూర్మన్నపాలెం సంతమామిడి తోటలో శిష్టకరణాల అసోసియేషన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిష్టకరణాలను ఒబిసిలో చేర్చాలని, ఆర్థికంగా వెనుకబడిన వారికి రుణాలివ్వాలని, ప్రభుత్వ గృహాలను కేటాయించాలని, విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, స్కాలర్‌షిప్ ఇవ్వాలని, తోకాడ కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌వియన్.గోపాల్, పివిఎస్.మూర్తి, కృష్ణారావు, కల్యాణి, కిశోర్‌బాబు పట్నాయక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల చేతుల్లోనే కర్మాగార భవిష్యత్

ఉక్కునగరం : విధి నిర్వహణ పట్ల ఉద్యోగులు చూపే అంకిత భావం, కృషిపైనే కర్మాగార భవిష్యత్ ఆధారపడి ఉంటుందని స్టీల్‌ప్లాంట్ ఈడి (వర్క్స్) ఒఆర్.రమణి అన్నారు. ఉక్కు వైఎస్ఆర్‌టియుసి ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప నేతృత్వంలో నాయకులు ఈడిని మంగళవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈడి మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో కర్మాగార ప్రగతికి ఉద్యోగులంతా సహకరించాలని కోరారు. ఉత్పత్తి, అమ్మకాల్లో కర్మాగారం పుంజుకుంటోందని, ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జివి.రమణారెడ్డి, కర్రి దాలినాయుడు, గండ్రెడ్డి రామునాయుడు, సాపే బ్రహ్మయ్య, బిపి.రెడ్డి, గెద్దాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరియర్స్‌తో కూడిన హెచ్ఆర్ఎ చెల్లించాలి

ఉక్కునగరం : ఉక్కు ఉద్యోగులకు నూతన బేసిక్‌పై 20శాతం హెచ్ఆర్ఎని 2014 జులై నుంచి ఎరియర్స్‌తో సహా చెల్లించాలని, ఈ విషయంలో ఎలాంటి షరతులు విధించరాదని యునైటెడ్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయిస్(యూజ్) నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ అధ్యక్షుడు బి.కామేశ్వరరావు అధ్యక్షతన కర్మాగారంలోని ఎల్ఎంఎం పార్కులో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య మాట్లాడుతూ, ఉద్యోగుల నూతన వేతన ఒప్పంద చర్చలను తక్షణమే ప్రారంభించడంతో పాటు 2011 నుంచి నిలిచిపోయిన జెఒ ప్రమోషన్లను పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు జి.గిరిబాబు, ఎన్.అమ్మన్న, ఎవి.అప్పారావు, చింతల అప్పారావు, అజ్మీరారెడ్డి, సిహెచ్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

లాభదాయకమైన ఇన్సెంటివ్‌కు డిమాండ్

ఉక్కునగరం : ఉక్కు కర్మాగారం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోన్న ఉద్యోగులకు లాభదాయకమైన ఇన్సెంటివ్ స్కీమ్ చెల్లించాలని తెలుగునాడు స్టీల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు కోరారు. యూనియన్ నాయకులు మంగళవారం స్టీల్‌ప్లాంట్ ఈడి(పి అండ్ ఐఆర్) దిబాషిస్‌రేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ, ప్లాంట్‌లో పేరుకుపోయిన వేస్ట్ మెటీరియల్‌ను తొలగించాలని కోరారు.

మహిళా సమస్యలపై పనిచేయాలి : ఐద్వా

గాజువాక : స్థానిక మహిళా సమస్యలపై పనిచేయాలని ఐద్వా నగర కార్యదర్శి ఆర్ఎన్.మాధవి పిలుపునిచ్చారు. ఐద్వా ఆధ్వర్యాన 60వ వార్డు పరిధి ఆటోనగర్‌లో మూడు రోజుల క్రితం మహిళలకు నిర్వహించిన పోటీల్లో విజేతలు 20 మందికి మంగళవారం బహుమతులు పంపిణీచేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరుగుతున్నా ప్రభుత్వం సంబంధం లేనట్లుగానే వ్యవహరిస్తుందని విమర్శించారు. పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో దళిత మహిళపై దాడే దీనికి నిదర్శనమన్నారు. టిడిపి, బిజెపి అధికారంలో వచ్చాక రాష్ట్రంలోనూ, దేశంలోనూ మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళల్లో చైతన్యం పెంపొందించాలనే ఉద్దేశంతో అన్ని ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు మంగవేణి, సంతోషం, అరుణ, నాగమణి, కుమారి, ఎస్ఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు ప్రియాంక, డివైఎఫ్ఐ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్ఎన్.మాధవి

తగ్గించిన ఇన్సెంటివ్‌ను చెల్లించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం

స్టీల్ మెల్ట్ షాప్(ఎస్ఎంఎస్) కార్మికులకు తగ్గించిన ఇన్సెంటివ్‌ను తక్షణమే చెల్లించాలని స్టీల్ సిఐటియు నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిఎం(ఎస్ఎంఎస్-1) ఆఫీస్ ముందు నిరసన తెలిపిన నాయకులు అనంతరం ఈడి(వర్క్స్) ఒఆర్.రమణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం స్టీల్ సిఐటియు అధ్యక్షుడు జె.అయోధ్యారాం మాట్లాడుతూ, కర్మాగారంలో కీలక విభాగమైన ఎస్ఎంఎస్‌లో ఉద్యోగుల ఇన్సెంటివ్‌ను తగ్గించడం వల్ల దాని ప్రభావం ఉత్పత్తి, ఉత్పాదకతలపై ప్రభావం చూపుతుందన్నారు. యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలతో కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. ఇన్సెంటివ్‌ను తక్షణమే చెల్లించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈడిని కలిసిన వారిలో నాయకులు బి.అప్పారావు, బి.తౌడన్న, ఎంవి.రమణ, పూర్ణచంద్రరావు, ముత్యాలనాయుడు, శ్రీనివాసరాజు, ఈశ్వరరావు, విజయమోహన్, కృష్ణమూర్తి, బంగారునాయుడు, శంకరరావు, మరిడయ్య, సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.



ఈడికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ఆలిండియా ఇంటర్ స్టీల్ చెస్ ఛాంపియన్ ఆర్ఐఎన్ఎల్

ప్రజాశక్తి-ఉక్కునగరం

ఆల్ ఇండియా ఇంటర్ స్టీల్ చెస్ ఛాంపియన్ షిప్-2017ను విశాఖ ఉక్కు కర్మాగారం (ఆర్ఐఎన్ఎల్) జట్టు కైవసం చేసుకుంది. రూర్కెలా స్టీల్‌ప్లాంట్‌లో గత వారం జరిగిన పోటీల్లో రూర్కెలా, టాటా స్టీల్ జట్లను ఓడించి ఈ ఘనత సాధించింది. ఆర్ఐఎన్ఎల్ జట్టులో అభిషేక్ మైత్రీ(కెప్టెన్), వివిఎస్.నాయుడు, ఎటి.శివప్రసాద్, పిజె.కిరణ్‌కుమార్, ఆర్.చైతన్య, డివి.రమణ (మేనేజర్), ఎం.ఆదినారాయణ(అబ్జర్వర్) ఉన్నారు. ఉక్కు సీనియర్ మేనేజర్(రిటైర్డ్) ఎంఎస్ఎన్.మూర్తి వీరికి శిక్షణ ఇచ్చారు. ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న ఆర్ఐఎన్ఎల్ జట్టును సిఎండి పి.మధుసూదన్, విఎస్‌పి స్పోర్ట్స్ కమిటీ చైర్మన్, జిఎం(హెచ్ఆర్) ఆర్వి.రావు, ఉక్కు క్రీడావిభాగాధిపతి ఎంఎస్.కుమార్, క్రీడా విభాగం అధికారులు టి.కాశీవిశ్వేశ్వరరావు, ఎ.క్రాంతికుమార్, ఎం.అన్వేష్ అభినందనలు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలవ్వండి

కూర్మన్నపాలెం : రక్తం దానం చేసి ప్రాణదాతలు కావాలని ఆర్‌డిడి రమణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారతీయ విజ్ఞాన మందిరం వ్యవస్థాపకులు కె.రఘురావు 77వ జయంతిని పురస్కరించుకొని కూర్మన్నపాలెం కెఆర్, భారతి ఐటిసిలో ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, రక్తదానం వల్ల ఎటువంటి నష్టమూ ఉండదన్నారు. అపోహలకు తావివ్వకుండా అందరూ స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ కనకారావు, సంస్థ చైర్మన్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

'రవీంద్ర ఇండియన్'కు స్వచ్ఛ పాఠశాల అవార్డు

ప్రజాశక్తి-గాజువాక

జివిఎంసి 61వ వార్డు పరిధి సుందరయ్య కాలనీలో ఉన్న రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు స్వచ్ఛ పాఠశాల అవార్డు లభించింది. జివిఎంసి కమిషనర్ హరినారాయణన్ ద్వారా పాఠశాల డైరెక్టర్ ఎస్‌వికె.పరశురాం అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ, ఈ అవార్డు రావడానికి కృషిచేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా పాఠశాలలో ఆయా కె.జానకి ఎంతో కృషిచేశారని కొనియాడారు. అవార్డుకు ఎంపిక చేసిన జోనల్ పబ్లిక్ హెల్త్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ సోమన్నారాయణ, ఉన్నారు.



స్వచ్ఛ పాఠశాల అవార్డును అందుకుంటున్న పరశురాం

జన్మభూమిలో సమస్యలపై ప్రశ్నించండి

గాజువాక : జన్మభూమి-మావూరు సభలలో సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నించాలని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి సూచించారు. గాజువాక హౌస్ కమిటీ సమస్య పరిష్కరించామని చెబుతూ కొందరికి మాత్రమే పట్టాలిచ్చారని తెలిపారు. 10800 మంది దరఖాస్తు చేసుకుంటే 5800 మందికి మాత్రమే షరతులతో కూడిన పట్టాలు ఇచ్చారని పేర్కొన్నారు. 2013 తర్వాత నిర్మాణాలకు, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని కోరారు. రహదారుల విస్తరణ, ట్రాఫిక్ సమస్యను సభలలో చర్చించి పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు.

ప్రారంభం రోజే మంత్రికి చుక్కెదురు

పింఛన్లు, రేషన్ కార్డులు, పాస్ పుస్తకాల కోసం మంత్రి గంటాను నిలదీసిన పేదలు

గందరగోళంగా జన్మభూమి గ్రామసభ



మంత్రిని నలదీస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - భీమునిపట్నం, పద్మనాభం, ఆనందపురం

'ఏళ్ల తరబడి కాగితాలు పెడుతున్నా పింఛన్లు ఇవ్వడం లేదు. రేషన్ కార్డులూ మంజూరు చేయడం లేదు. ఎవరి కోసం ఈ 'గ్రామసభలు' అంటూ మండలంలోని కాపులుప్పాడ పంచాయతీకి చెందిన పలువురు పేదలు రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావును నిలదీశారు. పంచాయతీ సర్పంచ్ నారు సంతోషికుమారి అధ్యక్షతన మంగళవారం మండలంలోని కాపులుప్పాడ కల్యాణ మండపం ఆవరణలో 5వ విడత జన్మభూమి- మా ఊరు గ్రామసభ జరిగింది. తొలుత ఎంపిడిఒ కె.హరి ప్రసాదరావు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం పంచాయతీ పరిధిలో పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఎప్పుడెప్పుడు, ఎన్నెన్ని దరఖాస్తులు వచ్చినవి, సంబంధిత అధికారులు సభలో చదివి వినిపించారు. ఇంతలో దుంప కనకమ్మ అనే మహిళ నిలబడి పింఛను కోసం దరఖాస్తు చేసి సంవత్సమైందని, ఇప్పటికీ ఇవ్వలేదని, ఎందుకొచ్చిన జన్మభూమి అంటూ మంత్రి గంటాను నిలదీసింది. 2016లో దరఖాస్తు చేశానని, ఇప్పటి వరకు రేషన్ కార్డు మంజూరు చేయలేదంటూ ఎం|డెడ్డి నర్సింహం



పద్మనాభంలో జెడ్‌పిటిసిని నిలదీస్తున్న స్థానికులు

ప్రశ్నించారు. జనసేన సేవాదళ్ కో-ఆర్డినేటర్ ఈశ్వర్ వేముల మాట్లాడుతూ అర్హులైన పేదలను కాదని కొంతమంది పెద్దోళ్లకు ఎన్టీఆర్ ఇళ్లు మంజూరు చేశారని, ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరపాలని మంత్రిని డిమాండ్ చేశారు. ఒకానొక దశలో నేరుగా మంత్రి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా సిఐ ఎస్ బాల సూర్యారావు, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో వైసిపి, జనసేన కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వ స్థలం లేదంటూ చెప్పడం ఏ మేరకు సబవని, ఇదే పంచాయతీ మాజీ సర్పంచ్ ఎరుసు అప్పలకొండ మంత్రిని ప్రశ్నించారు.

ఉనికి కోసమే అల్లరి : గంటా

కొంతమంది ప్రజాబలం లేనివార్లు రాజకీయంగా ఉనికి కాపాడుకోవడం కోసమే ఇలా అల్లరి చేస్తుంటారని మంత్రి గంటా తీవ్రంగా స్పందించారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం పంచాయతీకి మంజూరైన రేషన్ కార్డులు, పింఛన్లను మంత్రి గంటా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి జిల్లా ప్రత్యేకాధికారి వైవి అనూరాధ, ఎంపిపి యరబాల కృష్ణవేణి, ఎంపిటిసి కె.గౌరి, జెడ్‌పిటిసి సరగడ అప్పారావు, మాజీ ఎంపిపిలు గాడు వెంకటప్పుడు, ఉప సర్పంచ్ బోర బంగారురెడ్డి, టిడిపి నాయకులు కోరాడ రాజబాబు,



మధురవాడలో జన్మభూమిసభలో మాట్లాడుతున్న సత్యవేణి

చిక్కాల విజయబాబు, దంతులూరి అప్పల నర్సింహరాజు, పాసి నర్సింగరావు పాల్గొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మంత్రి సందర్శించారు.

పింఛన్ల రద్దుపై నిలదీత

పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలస, బి.తాళ్లవలస, రేవిడి గ్రామాల్లో మంగళవారం ఐదో విడత జన్మభూమి కార్యక్రమాలు జరిగాయి. బి.తాళ్లవలసలో వైసిపికి అనుకూలంగా ఉన్నారన్న నెపంతో 22 మంది పింఛన్లు తొలగించారని స్థానికులు నిలదీశారు. దీనికి స్పందించిన తహశీల్దారు కె.రమాదేవి ప్రస్తుతం ప్రభుత్వం పింఛన్లు ఇవ్వడం లేదని ఉగాదికి ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.తాళ్లవలస హైస్కూల్ విద్యార్థులు పారిశుధ్యంపై నిర్వహించిన నాటిక ఆకట్టుకుంది. నేరెళ్లవలస, రేవిడి గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కాళ్ల పద్మ, జెడ్‌పిటిసి కె.దామోదరరావు, మండల ప్రత్యేకాధికారి డి.నాగేశ్వరరావు ఎంపిడిఒ సిహెచ్.నిర్మలాదేవి, ఎఇ ఉమామహేశ్వరరావు, హిమబిందు, టిడిపి నాయకులు కాళ్ల నగేష్‌కుమార్ పాల్గొన్నారు.

5వ విడత జన్మభూమి

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలస రాజీవ్ గృహకల్ప సముదాయం వద్దగల జివిఎంసి కల్యాణ మండపంలో మంగళవారం జోనల్ కమిషనర్ సత్యవేణి ఆధ్వర్యంలో 5వ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. కాలనీ నాయకులు జెఎస్.రెడ్డి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను జెడ్సీకి తెలియజేశారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని జెడ్సీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ఎన్‌సి ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

జన్మభూమి సభలో గ్రామస్థుల నిలదీత

ఆనందపురం : తమకు భూములు ఉన్నా పట్టాదారు పాసు పుస్తకాలు లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నామని బోని గ్రామస్థులు మంగళవారం అధికారులను నిలదీశారు. మండలంలోని బోని, పెద్దిపాలెం, ముకుందపురం గ్రామాలలో మంగళవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. బోని గ్రామంలో ఎంపిడిఒ బి.అరుణశ్రీ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో పలువురు రైతులుపాస్ పుస్తకాలలేకపోడంతో ఎటువంటి రుణాలకు ధరఖాస్తులు చేసుకున్నా మంజూరు చేయడం లేదన్నారు. అనేక జన్మభూమి సభలో వీటిపై వీటిపై ధరఖాస్తులు చేసుకున్నా పరిష్కారం కావడం లేదన్నారు. బోని రోడ్డు పూర్తిగా శిథిలమైందని పక్కా రోడ్డు ఏర్పాటుచేయాలని వినతి పత్రం అందజేశారు. స్థానిక సర్పంచ్ సురాల సత్యవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ బి.మణిశంకర్ నాయుడు, ఎఎంసి చైర్మన్ కోరాడ నాగభూషణరావు, డిసిసిబి డైరెక్టర్ పాండ్రంగి అప్పారావు, ఎంపిటిసి బోని అప్పలనాయుడు జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పెద్దిపాలెంలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ కెవి ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు,



ఆనందపురం జన్మభూమిలో మాట్లాడుతున్న వక్త

పింఛన్లపై పిర్యాదులు ఎక్కువగా అందాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.పద్మజ తదితరులు పాల్గొన్నారు. ముకుందపురంలో జరిగిన కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆర్.రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇళ్లస్థలాలు కావాలని 22 మంది ధరఖాస్తులు చేసుకున్నారు. రేషన్‌కార్డులు కొరకు 14 మంది ,కళ్యాణమండపం అవసరమని అధికారుల దృష్టికి తెచ్చారు. పొలానికి వెళ్లి గొని గెడ్డ ఆక్రమణకు గురయ్యిందని పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు జన్మభూమి సభలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీరామమూర్తి సర్పంచ్ కోట్ల బాలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడి

విద్యార్థినులతో అసభ్యంగా మాట్లాడారని ఆరోపణ

ప్రజాశక్తి-సింహాచలం

అడవివరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు దాడికి దిగారు. శనివారం తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని నలుగురు విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయున్ని చితక్కొట్టారు. వివరాలు ఇలాఉన్నాయి. అడివరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి చదువుతున్న నాలుగురు విద్యార్థినులు ఇంటర్‌వెల్ సమయంలో టాయిలెట్‌కు వెళ్లారు అయితే కాస్త ఆలస్యం జరగడంతో ప్రధానోపాధ్యాయులు వీరిని పిలిచి మందలిస్తు మీరు ఇందసేపు ఎక్కడికి వెళ్లారని ఎవడితో వెళ్లారంటూ అడగడంతో పాటు దురుసుగా ప్రవర్తించారని వారి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. దీంతో విషియం తెలుసుకున్న తల్లిదండ్రులు మంగళవారం పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించి, కొట్టి వెళ్లిపోయారు. విషియం తెలుసుకున్న గోపాలపట్నం సిఐ వైకుంఠరావు పాఠశాలకు వచ్చి ఈ విషియంపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఉపాధ్యాయ మాత్రం ప్రధానోపాధ్యాయులు ఎప్పుడు విద్యార్థుల ఉన్నత ప్రమాణాలు అందించే దిశగా తయారు చేయడానికి ఆలోచించే వారని ఆదేసమయంలో క్రమశిక్షణ విషయంలో అంతే కఠినంగా వ్యవరిస్తారని తెలిపారు. కానీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సిఐ వైకుంఠరావు

విద్యార్థినులతో ఎప్పుడు అసభ్యంగా ప్రవర్తించరని వివరించారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేపట్టి తప్పు ఎవరు చేసినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

బాలుడికి గాయాలు

ప్రజాశక్తి-సాగర్‌నగర్



దాడిలో గాయపడ్డ బాలుడు

జివిఎంసి ఆరోవార్డు పరిధి గుడ్లవానిపాలెం ప్రాంతంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి 5 సంవత్సరాల బాలుడిని కరిచి లాక్కువెళుతుండగా స్థానికులు అడ్డుకొని జివిఎంసి హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఆ మిలుడు ఉదయంగుడ్లవాని పాలెం పాఠశాల నుంచి గ్రామంలోకి మధ్యాహనం వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హెల్త్ సెంటర్‌లో ఇంజక్షన్ చేసి తరువాత కెజిహెచ్‌కు తరలించారు.ఈ విషయంపై స్పందించిన స్థానికులు జివిఎంసి ఎప్పటికప్పుడు కుక్కలను తీసుకెళ్లడం లేదని ఎప్పుడైనా తీసుకెళ్లినా మళ్లీ ఇక్కడకే తెచ్చివదిలేస్తున్నారని విమర్శించారు.



గంగమ్మతల్లి జాతరలో పాల్గొన్న గంటా నూకరాజు

గంగమ్మ తల్లికి కలసాభిషేకం

భీమునిపట్నం:సునామీ, హుదూద్ లాంటి తుపానుల బారినుంచి కాపాడాలని, మత్స్య సంపద వృద్ది చెందాలని, మా బతుకుల బాగు పడాలంటూ స్థానిక ఎగువపేట మత్స్యకార మహిళలు మంగమారిపేట శ్రీ పోలమాంబ అమ్మవారి గుడి ఎదురుగా పెద్ద ఎత్తున కలసాభిషేకం చేశారు. పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లుపిల్లి నర్సింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, గ్రామ పెద్దలు వాసుపల్లి గరగయ్య, ఎం.అప్పన్న, ఎం.నూకరాజు, వి.చిట్టిబాబు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో 'సప్త రుషీశ్వర ఆలయం' విలీనం

సాగర్‌నగర్:జివిఎంసి ఆరోవార్డు పరిధి రుషికొండ బీచ్ సమీపంలో ఉన్న శ్రీసప్త రుషీశ్వర ఆలయం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేవాదాయ ధర్మాదాయ శాఖలోకి మంగళవారం విలీనం చేశారు. ఈ ఆలయం విస్తరణ సుమారుగా 3 ఎకరాల 6సెంట్లు లోఉంది. ఇందులో 54 సెంట్లులలో ఆలయం ఉంది. మిగతా అంతా ఖాళీ ప్రదేశం. ప్రతి ఏటా శివరాత్రి, కార్తిక మాసంల్లో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడకు వస్తుంటారు. ఈ ఆలయం రాబడి అధికంగా ఉండటంతో ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో తీసుకున్నారు. ఈ సందర్బంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇఒ పివిఎస్ భానురాజా మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఆలయంను తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ఇక్కడున్న హుండీకి సీల్ వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసి సుజాత, ఎం.శ్రీధర్, విఆర్ఒ సూర్యనారాయణ, రామకృష్ణ పరమహంస, హెచ్‌సి ఉమామహేశ్వరావు రాంబాబు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ లెక్కింపు

సింహాచలం:సింహాద్రప్పన్న హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం దేవస్థానం ఇఒ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడిచిన 13 రోజులకు గాను భక్తులు సమర్పించిన హుండీకి మెక్కుల ద్వారా వచ్చిన ఆదాయం నగదు రూ. 57 లక్షల 85 వేల 753, బంగారం 24.180 గ్రాములు, వెండి 3.480 కేజీలుగా తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

నేటి నుంచి సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ టోర్నమెంట్



సమావేశంలో మాట్లాడుతున్న సిఎస్ఐ చైర్మన్, ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ ప్రబీర్ రాయ్ చౌదరి

5, 6 తేదీల్లో ఇంపాక్ట్-2018 కన్వెన్షన్

సిఎస్ఐ ఛైర్మన్, ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ ప్రబీర్ రాయ్‌చౌదరి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

కంప్యూటర్ సైన్స్ ఆఫ్ ఇండియా (వైజాగ్ చాప్టర్) ఆధ్వర్యాన ఇంపాక్ట్-2018 పేర ఈ నెల 5, 6 తేదీల్లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి)పై జాతీయస్థాయి కన్వెన్షన్ నిర్వహిస్తున్నట్లు సిఎస్ఐ ఛైర్మన్, ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (కమర్షియల్) ప్రబీర్‌రాయ్ చౌదరి వెల్లడించారు. మంగళవారం ఉదయం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌తో కలిసి సిఎస్ఐ వైజాగ్ చాప్టర్ పనిచేస్తోందన్నారు. రోబో టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఇన్నోవేషన్స్‌కు అవకాశముండే కీలక సమాచారాన్ని, రీసెర్చి పత్రాలను దేశం నలుమూలల నుంచి వచ్చే ప్రతినిధులు విడుదల చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖను హబ్‌గా మార్చాలనే విధానం అనుసరిస్తున్నందున సిఎస్ఐ ఆ దిశగా విద్యార్థుల్లో ఐఒటిపై అవగాహన పెంచుతుందన్నారు. ఎయు ఇంజినీరింగ్ విద్యార్థులతో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో 900 మంది పాల్గొన్నారన్నారు. సెమినార్‌లను, వర్క్‌షాప్‌లను సిఎస్ఐ తరచూ నిర్వహిస్తుందన్నారు. పరిశోధకులు, ఇంజినీర్లు, డవలపర్లు, పరిశ్రమ ఔత్సాహికులు, విద్యావేత్తలు, ఎన్‌జిఒలు పాల్గొనే ఈ కన్వెన్షన్‌లో కొత్త టెక్నాలజీ సమాజానికి ఉపయోగపడే మార్గాలపై చర్చిస్తారన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి)కి సంబంధించి కొన్ని మానుఫ్యాక్చరర్స్ కంపెనీలు, స్టార్టప్‌లు కూడా తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. మూడు దశాబ్దాలుగా సిఎస్ఐ సేవలందిస్తుందన్నారు. ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఐటి సంస్థలు భాగస్వామ్యం ఉందన్నారు. 600 మంది లైఫ్ మెంబర్స్, 20 స్టూడెంట్ బ్రాంచీలు సిఎస్ఐకి ఉన్నాయన్నారు. తొలిరోజు 5న ప్రారంభమయ్యే ఈ కన్వెన్షన్‌ను స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి పి.మధుసూధన్ ప్రారంభిస్తారన్నారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీపై రెండో రోజు ఉదయం ఐఐఎస్‌సి ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.విశ్వనాథం (బెంగళూరు) పాల్గొంటారన్నారు. ఉప్పలపాటి శ్రీనివాసరాజు, ఎయు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ అవధాని, మెషిన్ టెక్నాలజీపై ఇస్రో డైరెక్టర్ డాక్టర్ సెంథిల్‌కుమార్ ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రజాశక్తి- మద్దిలపాలెం

ఆంధ్ర యూనివర్సిటీ రెండున్నర దశాబ్దాల తరువాత సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ (మెన్స్) టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. రఘు ఇంజినీరింగ్ కళాశాల సౌజన్యంతో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. మంగళవారం ఎయు అకడమిక్ సెనేట్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టోర్నమెంట్ వివరాలను ఎయు విసి ఆచార్య జి.నాగేశ్వరరావు వెల్లడించారు. టోర్నమెంట్‌లో ఐదు రాష్ట్రాల నుంచి 98 క్రీడా బృందాలు పాల్గొంటున్నాయని తెలిపారు. 1900 మందికి పైగా క్రీడాకారులు, జట్టు సిబ్బంది, కోచ్‌లు, మేనేజర్లు విశాఖ నగరానికి వస్తున్నారని అన్నారు. గతంలో 1982, 1992 సంవత్సరాలలో ఈ పోటీలకు ఆతిధ్యం కల్పించిందని చెప్పారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు రఘు ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీలను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభిస్తారని, జెఎన్‌టియుకె వీసీ ఆచార్య విఎస్‌ఎస్ కుమార్ కూడా పాల్గొంటారని తెలిపారు.

నాకౌట్ విధానంలో పోటీలు జరుగుతాయని, క్రీడా జట్లను నాలుగు పూల్స్‌గా విభజించామని తెలిపారు. గత ఏడాది సెమీ ఫైనల్స్‌కు చేరిన టీమ్‌లు నేరుగా సూపర్ క్వార్టర్స్‌లో పాల్గొంటాయన్నారు. బిసిసిఎ, ఎసిఎకు చెందిన అంపైర్లు మ్యాచ్‌లను నిర్వహిస్తారన్నారు. మొదటి సారిగా ఆన్‌లైన్ స్కోరింగ్ విధానాన్ని ఈ టోర్నమెంట్‌కు అమలు జరుపుతున్నామని చెప్పారు. కోచ్‌లు, మేనేజర్లు, సాంకేతిక సిబ్బందికి భోజన వసతిని రఘు ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ పోటీల్లో విన్నర్, రన్నర్‌లుగా నిలిచిన వారు రోహ్‌తక్‌లోని ఎమ్‌డి యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. విజేతలు బిసిసిఐ నిర్వహించే సర్ విజ్జి ట్రోఫీలో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. బిసిసిఐ ఇద్దరు సెలెక్టర్లను సౌత్‌జోన్ పోటీలకు పంపుతుందని తెలిపారు. క్రీడాకారుల కోసం 20 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రత్యేకంగా ఒక

ఐదు రాష్ట్రాల నుంచి 98 జట్లు

హెల్ప్‌డెస్క్‌ను నిర్వహిస్తున్నామన్నారు. రఘు కళాశాలకు చెందిన వంద మంది వలంటీర్లు కార్యక్రమాన్ని సమన్వయం జరుపుతున్నారన్నారు.

రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విశాఖకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. విభిన్న రాష్ట్రాలకు మన నగర విశిష్టత, వసతులపై అవగాహన ఏర్పడుతుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇటువంటి పోటీలతో విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, ఎయు స్పోర్ట్స్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా వేదికలు

రఘు ఇంజినీరింగ్ కళాశాల, ఎంవిజిఆర్ కళాశాల (విజయనగరం), సర్ విజ్జి స్టేడియం (విజయనగరం), ఎంఆర్ కళాశాల, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రైల్వే స్టేడియం, పోర్ట్ స్టేడియం, స్టీల్‌ప్లాంట్ ఉక్కు స్టేడియం, స్టీల్‌ప్లాంట్ త్రిష మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు. రఘు ఇంజనీరింగ్ కళాశాలలో 30 టీమ్‌లకు, స్టీల్ ప్లాంట్‌లో 16 టీమ్‌లకు, ఎయులో 52 టీమ్‌లకు వసతి సదుపాయం కల్పించామని తెలిపారు.